
కూటమిలో ఉప్పు-నిప్పు..!

కర్నూలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):
సాగునీటి సంఘాల ఎన్నికల నగారా మోగింది. మరో 24 గంటల్లో నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. రైతాంగంలో పట్టు సాధించేందుకు రాజకీయ నాయకులు ఈ ఎన్నికలను అస్త్రంగా మలుచుకుంటున్నారు. టీడీపీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి సారించారు. అయితే.. సాగునీటి ఎన్నికలు కూటమి పార్టీల్లో నిప్పు.. ఉప్పులా పరిస్థితి తయారైంది. టీడీపీ నాయకులు తమకు ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదని, కనీస సమాచారం ఇవ్వకుండానే అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారని బీజేపీ, జనసేన నాయకులు నిరసన స్వరంతో ఉన్నారు. అధిష్టానం నిర్ణయాలు మేరకు వివిధ పదవులు పంపకాల్లో కూటమి భాగస్వామ్య పార్టీలు బీజేపీ, జనసేనలకు 30 శాతానికి పైగా కేటాయించాలని అంటున్నారు. అన్ని నియోజకవర్గాల్లో మూడు పార్టీల ఇన్‌చార్జిలు కూర్చొని డబ్ల్యూయూఏ, టీసీ సభ్యుల అభ్యర్థుల ఎంపిక చేయడానికి జిల్లా నాయకత్వం సమన్వయం చేయాలని ద్వితీయశ్రేణి నాయకత్వం కోరుతోంది.

- సాగునీటి ఎన్నికల్లో కూటమి పార్టీల్లో సమన్వయ లోపం
- టీడీపీ ఏకపక్షంగా వెళ్తోందని బీజేపీ, జనసేన నేతల విమర్శ
- అభ్యర్థుల ఎంపికపై తమతో చర్చించలేదని ఆవేదన
- బీజేపీ, జనసేనకు 30 శాతం డబ్ల్యూయూఏ, టీసీలు ఇవ్వాలని డిమాండ్
- పోటీకి సై అంటున్న వైసీపీ నేతలు
- ఏకగ్రీవం చేసుకోవాలన్న కూటమి నాయకుల వ్యూహం ఫలించేనా..?





ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 14వ తేది సాగునీటి వినియోగదారుల సంఘాల (డబ్ల్యూయూఏ) ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో అభ్యర్థులను బరిలో దింపేందుకు ప్రతిపక్ష వైసీపీ సన్నాహాలు చేస్తోంది. పల్లెసీమల్లో చలికాలంలో నీటి సంఘాల ఎన్నికలు రాజకీయ మంటను రాజేశాయి. కర్నూలు జిల్లాలో కేసీ కాలువ, తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), హెచ్చెల్సీ, గాజులదిన్నె ప్రాజెక్టు, హంద్రీనీవా కాలువ, రాంపురం ఛానల్ కెనాల్ సహా మైనర్ ఇరిగేషన్ చెరువుల పరిధిలో 123 డబ్ల్యూయూఏల్లో పరిధిలో 1,212 మంది టీసీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. నంద్యాల జిల్లా కేసీ కాలువ, తెలుగుగంగ కాలువ, ఎస్సార్బీసీ కెనాల్ సహా మైనర్ ఇరిగేషన్ చెరువుల పరిధిలో 261 డబ్ల్యూయూఏల్లో 2,480 టీసీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. జిల్లా కలెక్టర్లు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా.. డబ్ల్యూయూఏ ఆథరైజ్డ్ అధికారులు నీటి సంఘాలు ఎన్నికలు జరిగే గ్రామాల్లో నోటిఫికేషన్ పబ్లిష్ చేశారు. శనివారం ఉదయం 9.45 గంటలకు ప్రక్రియ మొదలు కానుంది. అంటే.. మిగిలిన సమయం 24 గంటలే. రెండు జిల్లాలో టీడీపీ కూటమి పార్టీల తరఫున 3,692 టీసీ సభ్యులుగా అభ్యర్థులను బరిలోకి దింపాల్సి ఉంది. టీసీ ఎన్నికల అనంతరం సాయంత్రం 3 గంటల తరువాత ఎంపికైన టీసీ సభ్యులు సమావేశమైన వారిలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. మేజరు, మీడియం ప్రాజెక్టుల పరిధిలోని సాగునీటి సంఘంలో 12 మంది, మైనర్ ప్రాజెక్టుల పరిధిలోని నీటి సంఘంలో ఆరుగురు టీసీ సభ్యులు ఉంటారు. రెండు మూడు గ్రామాల్లో సాగునీటి పంపకాలు, కాలువల మరమ్మతులు, నిర్వహణలో కీలక బాధ్యతలు, రాజకీయంగా పట్టు ఉండే సాగునీటి సంఘం అధ్యక్ష పీఠం దక్కించుకోవాలంటే ముందు టీసీ సభ్యుడిగా గెలవాల్సిందే. దీంతో రాజకీయంగా గుర్తింపు, ప్రొటోకాల్ ఆశిస్తున్న అధికార కూటమి నాయకులు సాగునీటి సంఘం అధ్యక్ష పదవి కోసం ఎత్తులు వేస్తున్నారు.

కూటమి నేతల్లో సమన్వయం కుదిరేనా..?:

టీడీపీ, బీజేపీ, జనసేన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం నాయకత్వం మొదలుకొని దిగువ స్థాయి సామాన్య కార్యకర్తల వరకు గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం కష్టపడ్డారు. ఆ తరువాత గెలిచిన ఎమ్మెల్యేలు కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, ఇన్‌చార్జిలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. గత నెలలో మౌర్యఇన్ హోటల్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో జరిగిన కూటమి పార్టీ సమన్వయం సమావేశంలో గెలిచిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు తమను పట్టించుకోవడం లేదని, రాష్ట్ర స్థాయిలోనే కాదు దిగువ స్థాయిలో కూడా సమన్వయంతో ముందుకు వెళ్లాలని పలువురు కూటమి నాయకులు విమర్శించినట్లు తెలిసింది. ఆ సమావేశం తరువాత జరగుతున్న తొలి ఎన్నికలు ఇవి. ఒకటి రెండు నియోజకవర్గాల్లో కాస్త అటుఇటుగా కలసికట్టుగా ముందుకు వెళ్తున్నా.. మెజార్టీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు తమకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని కూటమి నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో మమ్ములను పట్టించుకోవడం లేదని, బలం ఉన్న గ్రామాల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కోడుమూరు నియోజకవర్గానికి చెందిన బీజేపీ, జనసేన నాయకులు కొందరు ఓటర్ల జాబితా కోసం శుక్రవారం జలమండలి కార్యాలయానికి వచ్చారు. ఆలూరులో ఇదే పరిస్థితి ఉంది. ఇక్కడ టీడీపీలోనే రెండు వర్గాలు ఆధిపత్యం కోసం ఈ ఎన్నికలను వేదికగా చేసుకున్నారు. తమతో చర్చించకుండానే టీడీపీ నేతలు ఏకపక్షంగా వెళ్తున్నారని బీజేపీ, జనసేన నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంత్రాలయంలో టీడీపీలోనే రెండు వర్గాలు ఆధితప్యం కోసం అభ్యర్థులను పోటీకి దింపేందుకు సిద్ధపడుతున్నారు. టీడీపీ నాయకత్వం ఏకపక్షంగా వెళ్తుంది.. రాష్ట్ర నాయకత్వం సూచించిన మేరకు డబ్ల్యూయూఏ, టీసీ సభ్యుల్లో మా కోటా మాకు ఇవ్వాల్సిందేని జనసేన ముఖ్యనాయకుడు డిమాండ్ చేస్తున్నారు. ఆదోనిలో డబ్ల్యూయూఏ స్థానాలు తక్కువే ఉన్నా.. బీజేపీ ఎమ్మెల్యే ఉండడంతో మాకు 70 శాతం ఇవ్వాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. పత్తికొండ, ఎమ్మిగనూరులో కూడా కూటమి నాయకుల మధ్య సమన్వయ లోపం కనిపిస్తుంది. నంద్యాల జిల్లాలో దాదాపుగా ఇదే పరిస్థితి ఉందని తెలుస్తుంది. గ్రామ స్థాయిలో బలమైన పట్టు లేకపోవడంతో ఈ ఎన్నికలపై పెద్దగా దృష్టి పెట్టలేదని, ఎవరైన ఆసక్తి ఉన్నవాళ్లు ముందుకు వస్తే.. టీడీపీ నాయకత్వంతో చర్చించి వారికి అవకాశం కల్పిస్తామని జనసేన నాయకుడు ఒకరు పేర్కొనడం కొసమెరుపు. అయితే.. కూటమి ధర్మం ప్రకారం 30 శాతం డబ్ల్యూయూఏ, టీసీ సభ్యులు ఇవ్వాలని బీజేపీ నాయకుడు ఒకరు కోరుతున్నారు.

మిగతా 6లో

కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

జిల్లాలో 9,324 మంది విద్యార్థులకు ప్రయోజనం

7

టమోటా కిలో రూ.1



నాణ్యతను బట్టి రూ.8 దాకా


పత్తికొండ మార్కెట్‌లో భారీగా పడిపోయిన ధర

6

అనాథ చిన్నారులకు పింఛన్



సదస్సులో పాల్గొన్న మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న సీఎం

- సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన కలెక్టర్ రంజిత్‌బాషా
- విధి విధానాలు రూపొందించాలని కలెక్టర్ల సదస్సులోనే ఆదేశాలు
- జిల్లా అభివృద్ధిపై ముఖ్యమంత్రికి నివేదించిన కలెక్టర్
- సమీక్షకు హాజరైన మంత్రి టీజీ భరత్

కర్నూలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సార్..! వివిధ ప్రమాదాల్లో తల్లిదండ్రులను, ప్రసవ సమయంలో అమ్మను కోల్పోయి అనాథలైన చిన్నారులకు మిషన్ వాత్సల్య పథకం ద్వారా మూడేళ్ల మాత్రమే సాయం అందుతోంది. ఎన్టీఆర్ భరోసా పింఛన్ ఇస్తే కొండంతా అండగా ఉంటుంది.. అని కలెక్టరు పి. రంజిత్‌బాషా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ సూచన చంద్రబాబు హృదయాన్ని తాకింది. చాలా మంచి ఆలోచన ఇది.. అమ్మానాన్నలు ఇద్దరినీ కోల్పోయిన చిన్నారులకు మొదట పింఛన్ అందజేద్దాం.. దీనిపై విధివిధానాలు తయారు చేయమని సంబంధిత అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. అనాథలైన చిన్నారులకు చంద్రబాబు నిర్ణయం ఎంతో ఆర్థిక భరోసా ఇస్తుందని, సీఎంకు ఈ సూచన చేసిన కలెక్టరు రంజిత్‌బాషాను సహచర కలెక్టర్లు, రాష్ట్రస్థాయి అధికారులు అభినందించారు. గురువారం అమరావతిలోని సచివాలయంలో జరిగిన రెండో రోజు కలెక్టర్ల సదస్సులో ఈ సూచన చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం కొలుదీరిన తరువాత జరిగిన తొలి కలెక్టర్ల సమీక్ష సందర్భంగా భర్తను కోల్పోయిన మహిళలకు తక్షణమే వింతంతు పింఛన్ ఇస్తే ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కుతారని చేసిన సూచనకు సీఎం చంద్రబాబు స్పందించి తక్షణమే అమలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో కన్నవాళ్లను కోల్పోయి అనాథలైన చిన్నారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ ఇస్తే బాగుంటుందని సూచిస్తే.. ముఖ్యమంత్రి తక్షణమే స్పందించడం అభినందనీయం అని కలెక్టరు రంజిత్‌బాషా పేర్కొన్నారు. జిల్లాలో వివిధ శాఖ ద్వారా సాధిస్తున్న ప్రగతి, చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు నివేదిక అందజేశారు.

పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట

పారిశ్రామిక ప్రగతి ద్వారానే ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఆ దిశగా కలెక్టర్ల దృష్టి సారించాలని సీఎం చంద్రబాబు కలెక్టర్లకు సూచించారు. జిల్లాలో సింగిల్ డెస్క్ విధానంలో 2023 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు 219 అనుమతులు ఇస్తే.. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 250 అనుమతులు ఇచ్చారు. మైక్రో, స్మాల్, సూక్ష్మ పరిశ్రమలు 25,785 ఏర్పాటు చేసి రూ.1144 కోట్లు పెట్టుబడి రాబట్టారు. స్టీల్, గోల్డ్ పరిశ్రమలు జిల్లాలో నిర్మాణాల్లో ఉన్నాయి. ఇదే కాకుండా మరో ఐదు భారీ పరిశ్రమలు రానున్నాయి. ఓర్వకల్లు క్లస్టర్‌లో ఆయా గ్రామాల్లో వివిధ పరిశ్రమలు ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

సాగునీటి ప్రాజెక్టులపై నివేదిక

వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టుల గురించి సీఎంకు కలెక్టరు నివేదించారు. తుంగభద్ర దిగువ కాలువ, కేసీ కాలువ నీటి వాటాలు, వినియోగం, రబీకి తాగునీటిపై వివరించారు. ఏపీఎస్ఐడీసీ కింద ఏడు ఎత్తిపోతల పథకాలు నిర్మాణా లో ఉన్నాయని వాటిని పూర్తి చేయా లని కలెక్టరు ఇచ్చిన నివేదికలో ఉన్నాయి.

ఉపాధిలో వెనకబడిన జిల్లా

జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో జిల్లా వెనుకబడింది. లేబర్ బడ్జెట్‌లో భాగంగా ఈ నెల 9వ తేది వరకు 59.15 లక్షల పనిదినాలు కల్పించి 60.98 శాతంలో 26వ స్థానంలో ఉన్నాయి. 2025 మార్చి ఆఖరు నాటికి 97 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యాలను నిర్దేశించారు. మెటీరియల్ కాంపోనెంట్ కింద కనీస కూలీ రూ.173, మెటీరియల్ కాంపోనెంట్ రూ.68.54 కలిపి రూ.241.56 మాత్రమే ఉంది. రూ.105లు బ్యాలెన్స్ ఉంది. కేవలం 39.40 శాతం ఖర్చుతో 12 స్థానంలో జిల్లా సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. 884 సీసీ రోడ్లు పనులు మంజూరు అయితే 790 పనులు క్షేత్రస్థాయిలో మొదలు పెట్టారు. 135 పనులు పూర్తి 13.11 శాతంతో 14 స్థానంలో నిలిచింది. పశువుల షెడ్లు 863 మంజూరు అయితే 709 పనులు మొదలు పెట్టారు. 62 పూర్తి చేసి 8.76 శాతంతో రాష్ట్రంలో జిల్లా 19వ స్థానంతో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. గ్రామీణ తాగునీటి సరఫరా శాఖ జల్‌జీవన్ మీషన్ (జేజేఎం) కింద రూ.24.63 కోట్లతో 37 పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో 13వ స్థానంలో ఉన్నాం. స్వచ్ఛాంధ్ర పథకంలో భాగంగా జిల్లాలో 439 గ్రామాలకు గానూ 398 గ్రామాలు ఎంపిక చేశారు. మోడల్ గ్రామాలు 35 మాత్రమే ఉన్నాయి. 7.97 శాతం ప్రోగ్రెస్ పెండింగ్‌లు ఉన్నాయని కలెక్టరు నివేదిక అందజేశారు.



సదస్సులో పాల్గొన్న కలెక్టర్

హాజరైన మంత్రి టీజీ భరత్

అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సదస్సుకు జిల్లాకు చెందిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు. వివిధ శాఖలపై సాధించాల్సిన పురోగతిపై సీఎం చంద్రబాబు కలెక్టర్లకే దిశానిర్దేశం చేశారు.

మద్దతు లేని వేరుశనగ

- మార్కెట్‌లో క్రమంగా తగ్గుతున్న ధర
- ఆందోళనలో రైతులు



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో వేరుశనగ కాయల ధర క్రమంగా తగ్గిపోతోంది. ప్రభుత్వం క్వింటంపై రూ.6,500 మద్దతు ధర ప్రకటించింది. గురువారం కర్నూలు మార్కెట్ యార్డులో గరిష్ఠ ధర ఇంతకంటే తక్కువగా రూ.6,419 నిర్ణయించారు. మధ్యస్థ ధర రూ.5,096కు, కనిష్ఠ ధర రూ.3,409కు ఘోరంగా పడిపోయాయి. సాధారణంగా మార్కెట్‌లో నిర్ణయించే మధ్యస్థ ధరకు దగ్గరిగా ప్రభుత్వం ప్రకటించే మద్దతు ధర ఉంటుంది. ప్రభుత్వం వెంటనే ఆదోని, కర్నూలు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తమకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అదే విధంగా మొక్కజొన్నలకు కూడా మద్దతు ధర యార్డులో అందడం లేదు. గరిష్ఠ ధర రూ.2,289, కనిష్ఠ ధర రూ.2,159కు చేరింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కనీసం రూ.3వేలైనా నిర్ణయిస్తే గాని తమకు గిట్టుబాటు కాదని రైతులు పేర్కొంటున్నారు. కందులకు క్వింటానికి రూ.9,536, మధ్యస్థ ధర రూ.9,009, కనిష్ఠ ధర రూ.2,500కు చేరిందని కర్నూలు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. శనగల ధర రూ.5,911గా నిర్ణయించారు. ఉల్లిగడ్డలకు క్వింటానికి గరిష్ఠంగా రూ.4,489, మధ్యస్థం రూ.4,211, కనిష్ఠం రూ.1,006గా నిర్ణయించారు. గతంలో 10వేల క్వింటాళ్ల దాకా ఉల్లిగడ్డలు విక్రయానికి వచ్చినా రూ.4,500 వరకు ధర ఉండేదని, గురువారం రూ.1,017 క్వింటాళ్లు మాత్రమే అమ్మకానికి వచ్చినా కేవలం రూ.4,489 అందిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండుమిరప కాయల ధర గరిష్ఠం రూ.15,659, మధ్యస్థ ధర రూ.12,459, కనిష్ఠం రూ.2,279కు అమ్ముడుపోయినట్లు సెక్రటరీ తెలిపారు. సజ్జలు గరిష్ఠం రూ.2,211, కనిష్టం రూ.2,191కు అమ్ముడుపోయాయి.

ఆదోని మార్కెట్‌లో గరిష్ఠం రూ.6,258

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం వేరుశనగ క్వింటం గరిష్ఠంగా రూ.6258 పలికింది. కనిష్ఠ ధర రూ.3,600, మధ్యస్థ ధర రూ.5780 పలికింది. మద్దతు ధర రూ.6,500గా ప్రభుత్వం నిర్ణయించింది. అయితే గత వారం ధరతో పోల్చితే వేరుశనగ ధర క్వింటానికి రూ.350 పైగా పెరిగింది. 488 బస్తాల వేరుశనగ విక్రయానికి వచ్చింది.

నేడు 'స్వర్ణాంధ్ర-2047' విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ

విజయవాడకు వెళ్లిన వివిధ శాఖల సిబ్బంది, ప్రముఖులు

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు 'స్వర్ణాంధ్ర-2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించనున్న నేపథ్యంలో జిల్లా నుంచి వివిధ శాఖల సిబ్బంది, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయ సంఘాల మహిళలు, రైతులు బస్సుల్లో విజయవాడకు తరలివెళ్లారు. ఈ ప్రయాణానికి ఏర్పాటు చేసిన బస్సులను గురువారం కలెక్టరేట్‌లో జేసీ నవ్య జెండా ఊపి సాగనంపారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి శుక్రవారం 'స్వర్ణాంధ్ర-2047' విజన్ డాక్యు మెంట్‌ను ఆవిష్కరించనున్నారని తెలిపారు. డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, కర్నూలు అర్బన్ తహసీల్దార్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న జేసీ నవ్య

డిగ్రీలో 11 మంది విద్యార్థులు డీబార్

కర్నూలు అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 1, 5వ సెమిస్టర్ పరీక్షల్లో 11 మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. 1వ సెమిస్టర్‌లో 5,669కి 4,788, 5వ సెమిస్టర్లో 9,164 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 8,267 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

చరిత్ర చెక్కిన కట్టడం

చరిత్ర కొన్ని అద్భుతమైన ఆనవాళ్లను మిగిల్చి వెళుతుంది. దాన్ని తలచుకున్నా, చూసినా ఆనాటి వైభవమంతా కళ్లకు కడుతుంది. బనగానపల్లె మండలంలోని పాతపాడు గ్రామం వద్ద ఎత్తైన కొండపై బనగానపల్లె నవాబుల కాలంలో నిర్మించిన పాతపాడు బంగ్లా అట్లాంటిది. నేడు అది శిథిలావస్థకు చేరుకుంది. కానీ చరిత్రతో ఒకప్పటి దాని గాంభీర్యత చెక్కుచెదరలేదు. 1908లో బనగానపల్లె నవాబు మీర్‌ఫజిల్ అలీఖాన్ పాతపాడు బంగ్లాను వేసవి విశ్రాంతి భవనంగా నిర్మించారు. సమీపంలో ఉన్న సున్నపు రాళ్ళతో ఈ బంగ్లాను నిర్మించారు. సుమారు 116 సంవత్సరాల క్రితం ఈ బంగ్లాను బనగానపల్లె నవాబు వేసవి విడిది కోసం కొండపై నిర్మించుకున్నారు. లోపల నిర్మాణం దెబ్బతినిపోయినా వెలుపలి భాగం మాత్రం ఇప్పటికీ అట్లాగే ఉన్నది. యాగంటికి వెళ్లే మార్గంలో పెద్ద కొండపై తాజ్‌మహల్‌ను తలపించేలా నవాబు తన అభిరుచికి అనుగుణంగా నిర్మించారు. అన్ని కాలాల్లోను ఎంతో చల్లగా ఉండేలా ఈ బంగ్లాను నిర్మించడం విశేషం. కర్నూలుకు 83 కిలోమీటర్ల దూరంలో, నంద్యాలకు 53 కిలోమీటర్ల దూరంలో, బనగానపల్లెకు 8 కిలోమీటర్ల దూరంలో ఈ బంగ్లా ఉంటుంది.

- బనగానపల్లె, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి)



పాతపాడు బంగ్లా



లోపలి భాగంలో పెచ్చులూడిన దృశ్యం




అరుంధతి బంగ్లాగా గుర్తింపు

యాగంటికి వచ్చే భక్తులు తప్పనిసరిగా పాతపాడు బంగ్లాకు వచ్చి సందర్శిస్తుంటారు. అనేక సినిమాలు, సీరియల్‌లు ఈ బంగ్లాలో నిర్మించారు. అరుంధతి సినిమాతో పాతపాడు బంగ్లా కాస్త అరుంధతి బంగ్లాగా మారింది. కోడి రామకృష్ణ దర్శకత్వంలో అనుష్క అరుంధతిగా ఈ చిత్రం నిర్మించారు.

- లోపల శిథిలమైపోయిన బంగ్లా
- పర్యాటకులను ఆకట్టుకుంటున్న నిర్మాణం
- అరుంధతి బంగ్లాగా గుర్తింపు

బంగ్లా చరిత్ర: 1601లో బీజాపూర్ సుల్తాన్ ఇస్మాయిల్ ఆదిల్‌షా నందచక్రవర్తిని ఓడించి బనగానపల్లె కోటను ఆక్రమించుకున్నాడు. ఈ ప్రాంతాన్ని ఆదిల్‌షా సేనాధిపతి 1665 వరకు తన ఆధీనంలో ఉంచుకున్నారు. మహమ్మద్‌బేగ్ బనగానపల్లె జాగీర్‌పై శాశ్వత హక్కుదారుడయ్యారు. అతను చనిపోవడంతో అతని దత్తపుత్రుడు ఫైజ్ అలీఖాన్‌కు బనగానపల్లె కోట ఆధీనంలోకి వచ్చింది. 1686లో బీజాపూర్‌ను ఔరంగజేబ్ ఆక్రమించడంతో బనగానపల్లె కోట మొగలు సామంతుల ఆధీనంలో ఉండేది. 1724లో మొగలుల నుంచి స్వాతంత్ర్యం ప్రకటించుకున్న హైదరాబాద్ నిజాం సామంతులుగా ఉన్న బనగానపల్లె నవాబు పాలన కిందికి వచ్చింది. అయితే 1800లో బనగానపల్లె సంస్థానం బ్రిటిష్ ఇండియాలో కలిసింది. ఈ సంస్థానాన్ని బనగానపల్లె నవాబులు పాలించారు. 1948లో బనగానపల్లె సంస్థానం భారతదేశంలో కలసిపోయింది.



ఆకట్టుకుంటున్న పాతపాడు బంగ్లా: పచ్చటి పొలాలు, చక్కటి ఆహ్లాదకర వాతావరణం, బెలుంగుహలు, అవుకు రిజర్వాయర్, పాతపాడు బంగ్లా, యాగంటి వంటి చారిత్రాత్మక కట్టడాలు ఉన్న ప్రాంతం కావడంతో ఇక్కడ సినిమాలు, సీరియళ్ల షూటింగ్ జరుగుతూ ఉంటాయి. గతంలో యాగంటితో పాటు పాతపాడు బంగ్లాలో కూడా చిన్న చిన్న సన్నివేశాలు చిత్రీకరించారు. తాజాగా యూట్యూబ్, సామాజిక మాధ్యమాల్లో నిర్మించే లఘు చిత్రాలతో పాటు, పలు సినిమాల షూటింగ్‌కు బనగానపల్లె కేంద్రంగా మారుతోంది. స్పీడున్నోడు, శరభ, ఒక పల్లెటూరు ప్రేమకథ, సుమన్ హీరోగా సత్యాగ్యాంగ్, రాయలసీమ లవ్‌స్టోరీ, నేత్ర, బంగారు బాలరాజు, తెనాలి రామకృష్ణ, గద్దలకొండ గణేశ్ తదితర ఎన్నో చిత్రాలు, టీవీ సీరియళ్లు ఇక్కడ నిర్మించారు.

కూటమిలో ఉప్పు-నిప్పు !

(5వ పేజీ తరువాయి)

పోటీకి సిద్ధమవుతున్న వైసీపీ

టీడీపీ కూటమి నాయకులు సాగునీటి సంఘాల టీసీ సభ్యులు, డబ్ల్యూయూఏ అధ్యక్ష పీఠాలను ఏకగ్రీవం చేసుకోవాలని రాజకీయ వ్యూహాలకు పదును పెడుతున్నారు. ప్రాజెక్టుల వారిగా పోటీ చేసే టీసీ సభ్యులు, డబ్ల్యూయూఏ అధ్యక్ష అభ్యర్థులను దాదాపుగా ఎంపిక చేశారు. శుక్రవారం కూటమి పార్టీల నాయకులతో చర్చించి తుది జాబితా ప్రకటిస్తామని, సమన్వయంతో ముందుకు వెళ్తామని టీడీపీ జిల్లా ముఖ్యనాయకుడు ఒకరు పేర్కొన్నారు. అయితే.. మేము సైతం పోటీకి సై అంటూ వైసీపీ నాయకులు కూడా సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆలూరులో 24 సాగునీటి సంఘాలు, 210 టీసీ సభ్యులు, మంత్రాలయంలో 22 సాగునీటి సంఘాలు, 246 టీసీ సభ్యులకు ఎన్నికలు జరుగుతాయి. అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థుల అన్వేషణలో వైసీపీ ఎమ్మెల్యేలు నిమగ్నమయ్యారు. దీంతో అక్కడ పోటాపోటీగా ఎన్నికల జరిగే అవకాశం ఉంది. కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో మెజార్టీ డబ్ల్యూయూఏ టీసీ సభ్యుల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వైసీపీ ఇన్‌చార్జిలు రాజకీయ సన్నాహాలు చేస్తున్నారు. నామినేషన్‌లు తిరస్కరణకు గురికాకుండా ఓటరు జాబితాలో పేరు, నీటి తీరువా బకాయి లేకుండా తహసీల్దారులతో నోడ్యూ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు.

కర్నూలు జిల్లాలో నియోజకవర్గాల వారిగా డబ్ల్యూయూఏ, టీసీ, డీసీ స్థానాలు

నియోజకవర్గం	డబ్ల్యూయూఏ	టీసీ స్థానాలు	డీసీలు
కోడుమూరు	23	252	3
ఎమ్మిగనూరు	23	264	3
మంత్రాలయం	22	246	3
ఆదోని	5	42	--
పత్తికొండ	20	144	--
ఆలూరు	24	210	1
పాణ్యం	6	54	--
మొత్తం	123	1,212	10

ఉమ్మడి జిల్లాలో వివరాలు

వివరాలు	కర్నూలు	నంద్యాల
డబ్ల్యూయూఏలు	123	261
టీసీ సభ్యులు	1,212	2,480
డిస్ట్రిబ్యూటరీ కమిటీలు	10	24
ఓటర్లు	1,32,112	3,09,246

మద్దతు ధర ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం

వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని

కల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు మద్దతు ధర అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు మండలం రేమడూరులో ఆయన పర్యటించి రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. కాటసాని మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిపాలించే నాయకుడు రైతుల కష్టాల గురించి ఆలోచిస్తేనే వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. గత ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని ప్రజలను మరిచిపోయేలా ప్రభుత్వాలు, నాయకులు ఉండటం దారుణమన్నారు. సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చి గెలిచిన అనంతరం హామీలు అమలు చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తే అక్రమ కేసులుపెట్టి దుర్మార్గ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. రైతన్నలకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాక వారి పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. కల్లూరు మండల కన్వీనర్ పెద్ద ఈశ్వరయ్య, రామకృష్ణారెడ్డి, మస్తాన్, నారాయణరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రేమడూరులో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

జగన్‌ను ప్రజలే తరిమి కొడతారు

'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజం



కర్నూలు అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రజల మధ్యకు వస్తే వారే తరిమికొడతారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. కర్నూలు నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేని జగన్.. వైసీపీ శ్రేణులకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు నివ్వడం సిగ్గుచేటు అని అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర సంపదను అప్పటి మంత్రులు, సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు దోచుకోవడంతో ప్రజలు ఘోరంగా ఓడించారని అన్నారు. అయినా జగన్‌కు సిగ్గురాలేదని మండి పడ్డారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కేవలం 6నెలల్లో ఎన్నో ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, పరిశ్రమలు సాధించారని గుర్తు చేశారు. గతంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బు ఇవ్వక పోవడంపై రైతులు ఆగ్రహంతో ఉన్నారని, గతంలో నీవు బకాయిలు పెట్టిన రైతుల సొమ్మును వారి ఖాతాల్లోకి కూటమి ప్రభుత్వం వేసిందని అన్నారు. ఏ2 విజయసాయిరెడ్డి చంద్రబాబు గురించి అవాక్కులు, చెవాక్కులు పేలడం వింతగా ఉందన్నారు. వైజాగ్‌లో భూ ఆక్రమణలు, అక్రమాలు చేశారని ధ్వజమెత్తారు. అమరావతి, పోలవం నిర్మాణాలు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే జగన్ జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఇసుక, మద్యం, లిక్కర్, గంజాయి వంటి మాఫియాల మయమైన వైకాపా పాలన సాగించిందని మండి పడ్డారు. చంద్రబాబు పాలన గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. వైకాపా నాయకులు కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలన్నారు.

704 అర్జీల స్వీకరణ

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 29 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 704 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. గురువారం ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలం గోనెగండ్లలో 21, నందవరం మండలం హాలహర్వి గ్రామంలో 49, ఎమ్మిగనూరు మండలం కడివెళ్లలో 33, కోసిగి మండలం నేలకోసిగి గ్రామంలో 18, గౌడగళ్లలో 13, మంత్రాలయం మండలం మాధవరంలో 9, మాధవరం తాండాలో 1, పెద్దకడుబూరు మండలం తారాపురంలో 5, ఆదోని మండలం బసాపురంలో 12, నాగనాతహల్లిలో 26, హొళగుంద మండలం హెబ్బటంలో 22, కౌతాళం మండలం వల్లూరు గ్రామంలో 13, కుంబలనూరు గ్రామంలో 11, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని కర్నూలు అర్బన్ జొహరాపురంలో 13, ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామంలో 148, కల్లూరు మండలం లక్ష్మీపురంలో 40, వెల్దుర్తి మండలం బుక్కాపురం గ్రామంలో 13, కోడుమూరు మండలం కోడుమూరు గ్రామంలో 37, కర్నూలు రూరల్ మండలం జి. సింగవరం గ్రామంలో 18, గూడూరు మండలం బూడిదపాడు గ్రామంలో 13, సి. బెళగల్ మండలం కొండాపురం గ్రామంలో 21, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని పత్తికొండ మండలం పందికోన గ్రామంలో 16, క్రిష్ణగిరి మండలం క్రిష్ణగిరి గ్రామంలో 24, మద్దికెర మండలం మద్దికెర ఈస్ట్ గ్రామంలో 45, ఆలూరు మండలం ఆలూరు గ్రామంలో 32, చిప్పగిరి మండలం ఏరూరులో 13, ఆస్పరి మండలం డి. కోటకొండ గ్రామంలో 10, హాలహర్వి మండలం బిళేహాల్ గ్రామంలో 17, దేవనకొండ మండలం కరివేముల గ్రామంలో 11 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఇందులో ప్రభుత్వ భూములపై ఆక్రమణ, రక్షణ 24, ఏపీ ఆన్‌లైన్ భూములు (పీవోటీ యాక్టు 1977)లో 5 ఫిర్యాదులు, ఇంటి పట్టాల కోసం 8, ప్రభుత్వ భూమి కోసం 33, కుల ధృవీకరణ 1, నిషిద్ధ భూముల జాబితా నుంచి తమ భూములు తొలగించాలనే ఫిర్యాదులు 44, రీసర్వే గ్రీవెన్స్‌లో 47, జీఎస్ డబ్ల్యూఎస్, మీసేవ గ్రీవెన్స్‌లో 1, ఇనామ్స్ గ్రీవెన్స్‌లో 16, భూసేకరణ ఫిర్యాదు 1, ఆర్వోఆర్ కేసులకు సంబంధించి 467, రెవెన్యూ అండ్ అదర్ కోర్ట్ 1, వాల్టా యాక్టు 1, ఇతరాలు 56 అర్జీలు వచ్చాయన్నారు.



టమోటా కిలో రూ. 1

- నాణ్యతను బట్టి రూ.8 దాకా
- పత్తికొండ మార్కెట్‌లో భారీగా పడిపోయిన ధర
- చేతులెత్తేస్తున్న వ్యాపారులు
- దిగుబడిని పారబోసి రైతుల నిరసన

పత్తికొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌లో టమోటా ధరలు భారీగా పడిపోయాయి. నాణ్యతను బట్టి గురువారం ధర రూపాయి నుంచి రూ.8 వరకు ధర పలికింది. వ్యాపారులు ఎగుమతిచేసే ప్రాంతాలలో ధరలు అమాంతం పడిపోవడమే ధరలు తగ్గడానికి కారణంగా తెలుస్తోంది. పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌కు రోజూ సుమారు 200 టన్నుల టమోటా దిగుబడి అమ్మకానికి వస్తోంది. ఇక్కడ పంటను కొనుగోలు చేసిన వ్యాపారులు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. గత రెండు రోజులుగా ఆ ప్రాంతాల్లో స్థానికంగా పండుతున్న టమోటా దిగుబడులు మార్కెట్లకు వస్తుండడంతో పత్తికొండ మార్కెట్ నుంచి ఎగుమతి అవుతున్న టమోటాకు డిమాండ్ తగ్గింది. దీంతో వ్యాపారులు తక్కువ ధరకు టమోటాను కొనుగోలు చేశారు. పై మార్కెట్ ధరలను బట్టే తాము పంటను కొనుగోలు చేసి ఎగుమతి చేస్తామని, అక్కడి మార్కెట్లలో ధరలు లేకపోతే తామేమి చేయగలమని వ్యాపారులు చెబుతున్నారు. గ్రేడింగ్ చేసిన పంటను మార్కెట్‌కు తీసుకురావాలని వారు రైతులకు విజ్ఞప్తి చేస్తున్నారు.


టమోటాను పారబోసిన రైతులు

20 కిలోల బాక్స్‌లు జత రూ.40కి వ్యాపారులు కొనుగోలు చేయడంతో కొందరు రైతులు దిగుబడిని నేలపై పారబోసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరికొందరు రైతులు గిట్టుబాటు ధరకల్పించాలంటూ గుత్తి-పత్తికొండ రహదారిపై 10 నిమిషాలు బైటాయించి నిరసన తెలిపారు.



ఆందోళన చేస్తున్న అన్నదాతలు

టమోటా గంపలు జత రూ.100 చొప్పున కొన్నారు



ఎకరా పొలంలో పంటను సాగు చేశాను. 10 కిలోల కలిగిన 20 గంపల టమోటాను మార్కెట్‌కు తెచ్చాను. వ్యాపారులు జత గంపలు రూ.100 చొప్పున కొనుగోలు చేశారు. కిలో ధర రూ.5 పలికింది.

- రాముడు, రాతన


జత బాక్సుల ధర రూ.40 పలికింది



20కిలోల బాక్స్‌లు 10 మార్కెట్‌కు తెచ్చాను. జత బాక్సులు రూ.40 చొప్పున కొనుగోలు చేశారు. కిలో రూపాయి పలికింది. ప్రభుత్వం టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి.

- సోమన్న, హోసూరు

అధికారులకు సమాచారం ఇస్తాం



ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచి టమోటా ధరలు ఆశాజనకంగా సాగాయి. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలలో అధిక వర్షాల దాటికి పంటలు దెబ్బతినడంతో ఇక్కడి నుంచి వెళ్లిన టమోటాకు మంచి డిమాండ్ దొరికింది. ప్రస్తుతం ఆయా ప్రాంతాలలో స్థానికంగా దిగుబడులు రావడంతో మన దగ్గర నుంచి వెళ్లే పంటకు డిమాండ్ తగ్గింది. దీంతో వ్యాపారులు నాణ్యత ఉన్న పంటను మంచి ధరకు, నాణ్యతలేని పంటను తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు గుర్తించాం. టమోటా ధరలపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. రైతుకు గిట్టుబాటు ధరను అందించేందుకు ప్రయత్నిస్తాం. రైతులు కూడా గ్రేడింగ్‌చేసిన పంటను మాత్రమే మార్కెట్‌కు తెస్తే వారికి న్యాయం చేయగలం.

- కార్నలీస్, మార్కెట్‌యార్డు కార్యదర్శి

సదరం సర్టిఫికెట్ల జారీలో అవినీతిని సహించం

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు



వైద్యులతో సమీక్ష నిర్వహిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్ల జారీలో అవినీతికి పాల్పడితే బాధ్యులైన వైద్యులు, ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం సూపరింటెండెంట్ చాంబరులో సదరం కేసులు, పెండింగ్‌లో ఉన్న జాబితాపై సమీక్ష నిర్వహించారు. న్యూరో సర్జరీ, న్యూరాలజీ, సైకియాట్రీ, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ విభాగాల హెచ్‌వోడీలతో మాట్లాడారు. సదరంపై అప్రూవల్ అయిన పెండింగ్, ఇతర కేసులపై ఆరా తీశారు. అంగవైకల్యం లేని దరఖాస్తుదారులకు, నకిలీ సదరం సర్టిఫికెట్లలో వైకల్యం శాతాన్ని పెంచినట్లు వైద్యులు, ఇతర ఉద్యోగులపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సదరం సర్టిఫికెట్ల జారీలో వైద్యులతో సహా ఉద్యోగులందరూ వైకల్య ధ్రువీకరణ పత్రాలను ప్రాసెస్ చేయడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమీక్షలో డిప్యూటీ సూపరింటెండెంట్ డి.శ్రీరాములు, సీఎస్‌ఆర్‌ఎంవో బీవీ రావు, న్యూరాలజీ సీనియర్ హెచ్‌వోడీ సి.శ్రీనివాసులు, ఆర్థో హెచ్‌వోడీ కె.శ్రీనివాస్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లల మృతి



గాజులపల్లిలో కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

మహానంది, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలతో పాటు మరో రెండు పెద్ద గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన చాకలి రామకృష్ణ గొర్రెలు మోపుతూ జీవనం సాగిస్తున్నారు. పాత శివాలయం వెనుక వైపు ఉన్న పాకల్లో గొర్రె పిల్లల వద్ద కాపల లేని సమయంలో వీధి కుక్కలు దాడి చేసి చంపాయని, దీనివల్ల తనకు రూ.2 లక్షలకు పైగా నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనా స్థలాన్ని పశువైద్యుడు డాక్టర్ శివానంద్, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు రామకృష్ణ కోరారు.

వైసీపీ యువజన నాయకుడి అరెస్టు

కర్నూలు క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరికిపాటి ప్రేమ్‌కుమార్‌ను కర్నూలు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఐటీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు తిలక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొరికిపాటి ప్రేమ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామని సీఐ శేషయ్య తెలిపారు. రాష్ట్రంలో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలంటే టోల్ కట్టాల్సిందే అంటూ ప్రేమ్‌కుమార్ ముఖ్యమంత్రిని ఉద్దేశిస్తూ అసందర్భ వ్యాఖ్యలు చేశారని తిలక్ రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గుంటూరు నుంచి అరెస్టు చేసి కర్నూలుకు తీసుకువచ్చారు. గురువారం రాత్రి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

నాటు సారా తాగి వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో విచ్చలవిడిగా లభిస్తున్న నాటు సారా తాగి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని మీర్జాపురం గ్రామంలో జరిగింది. గ్రామంలో కూలీ పనులు చేసుకొని జీవించే పిక్కిలి రొడ్డ నాగన్న(63) గత రెండు రోజులుగా నాటుసారా తాగుతూ బుధవారం రాత్రి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుమారుడు నాగరాజు సపర్యలు చేసినా తేరుకోలేదు. గురువారం ఉదయం మృతి చెందాడు. కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న మీర్జాపురం గ్రామంలో నాటు సారా విక్రయం విచ్చలవిడిగా జరుగుతున్నదని, స్థానిక పోలీసులు గానీ, ఎక్సైజ్ పోలీసులు గానీ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



మృతి చెందిన పిక్కిలి నాగన్న

గుండె శస్త్రచికిత్స విజయవంతం

- చిన్న కోతతోనే రోగికి ఆపరేషన్
- సీఎం సహాయ నిధి కింద ప్రాణం పోసిన వైద్యుడు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం మునగాల పాడు గ్రామానికి చెందిన 31 ఏళ్ల గిడ్డయ్య ఓ రైతు. ఆయన గుండెలో ఉండే రెండు కవటాలు మెట్రల్, అయోర్టిక్ రెండూ చెడిపోయాయి. రెండింటినీ కచ్చితంగా అమర్చాలి. రెండు కవటాలు అమర్చడం చాలా ఖరీదుతో కూడుకున్నది. ఈ ఆపరేషన్‌కు డా.ఎన్టీఆర్ వైద్యసేవ కింద రూ.2 లక్షల ప్యాకేజీ ఉంది. అయితే రోగికి ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు లేదు. ప్రైవేటులో ఆపరేషన్‌కు లక్షల రూపాయల ఖర్చు అవుతుంది. ఈ పరిస్థితుల్లో రోగి కర్నూలు జీజీహెచ్‌కు వచ్చి సిటీ సర్జన్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి దగ్గరకు వచ్చారు. ఎలాగైనా ఆపరేషన్ చేయాలని వేడుకొన్నారు. దీంతో సీటీ సర్జన్ డా.సి.ప్రభాకర్ రెడ్డి రోగి కేసును సీఎం సహాయనిధి కింద దరఖాస్తు చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవ కార్డు లేకపోయినా పేద రైతు కావడంతో ఆయన దరఖాస్తును వెంటనే సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు.



రోగితో సీటీ సర్జన్ డా.ప్రభాకర్ రెడ్డి

చిన్న కోత పద్ధతిలో..

రోగి పని చేసుకునే వయస్సు. ఎముక కట్ చేస్తే చాలా రోజులు పని చేసుకోలేరు. సిక్ అవుతాడని భావించి సీనియర్ సిటీ సర్జన్ డా.ప్రభాకర్ రెడ్డి ఆయనకు మిని మిల్లీ ఇన్వాసివ్ హార్ట్ సర్జరీ (ఎంఐసీఎస్) చిన్న కోత పద్ధతిలో రెండు వాల్వ్‌లు రిప్లేస్‌మెంటు హార్ట్ సర్జరీని ఈ నెల 11వ తేదీన సీటీ సర్జన్ డా.ప్రభాకర్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రవీంద్ర దాదాపు 4 గంటలు శ్రమించి ఆపరేషన్‌ను విజయవంతంగా చేశారు. ఈ ఆపరేషన్ రెండు వాల్వు రిప్లె సిమెంటు చేయాలంటే చిన్న కోత పద్ధతిలో కార్పొరేట్‌లో రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సీఎం సహాయ నిధి కింద ఆపరేషన్ నిర్వహించినట్లు డా.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. చిన్న కోతతో ఆపరేషన్ చేయడం వల్ల రోగి త్వరగా కోలుకుంటారని, నొప్పి, రక్తస్రావం తక్కువగా ఉంటుందని వెల్లడించారు.

కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

- జిల్లాలో 9,324 మందికి ప్రయోజనం



కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇంటర్మీడియట్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం 2019 వరకు అమలు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు తిరిగి మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించనున్నట్లు ప్రకటించింది. కళాశాలల్లో ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు, పౌష్టికాహారం అందించేందుకు ఈ పథకం చేపడుతున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. దీంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్న అధికారులు

జిల్లాలో 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 4 ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో 9,324 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో చదువుతున్నారు. వీరిలో 80 శాతానికి పైగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారే. కళాశాలలు దూరం కావడంతో ఇంటి నుంచి ఉదయం 7 గంటలకే బయలుదేరి కళాశాలలకు చేరుతున్నారు. చాలా గ్రామాల్లో బస్సు ప్రయాణాలు లేక ఆటోల్లో, బైకులపై వస్తున్నారు. ఆర్థిక స్థోమత లేక అర్ధాకలితో చదువుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. విద్యార్థుల సంఖ్య, వంట పాత్రలు, షెడ్లు, నిర్వాహకుల సరుకుల తదితర వివరాలు సేకరిస్తున్నారు.

క్యారియర్ తెచ్చుకోకపోతే ఇబ్బందే



చాలామంది గ్రామాల నుంచి కళాశాలలకు వస్తున్నారు. ఉదయం 9 గంటలకే కళాశాలకు చేరుకోవాలి. బస్సు లేకపోతే సమయానికి రాలేక పోతున్నాం. ఇంటి నుంచి ఉదయం 8 గంటలకే బయలుదేరాలి. క్యారియర్ లేకపోతే ఇబ్బంది పడుతున్నాం. **- చంద్రశేఖర్, సీనియర్ ఇంటర్**

గ్రామీణ విద్యార్థులకు మేలు



జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయడం వల్ల గ్రామాల విద్యార్థులకు మేలు. కళాశాల సమీపంలో ఎలాంటి అన్న క్యాంటీన్లు లేవు. భోజనం చేయాలంటే హోటల్‌కు వెళ్లాల్సి వస్తున్నది. అంత డబ్బు పెట్టే స్థోమత లేని విద్యార్థులకు ఈ పథకం మేలు చేస్తుంది. **- కవిత, సీనియర్ ఇంటర్**

మధ్యాహ్న భోజనంతో ప్రయోజనం



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలనుకోవడం మంచి నిర్ణయం. విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్ అందుతుంది. పేద విద్యార్థులను పై చదువులకు ప్రోత్సహించేందుకు దోహదపడుతుంది.

- ఎస్. నాగస్వామి నాయక్, ప్రిన్సిపాల్, వృత్తి విద్యా కళాశాల, బి.క్యాంపు, కర్నూలు.

క్రీస్తు మార్గం అనుసరణీయం



క్యాండిల్ లైట్ సర్వీస్‌లో మాట్లాడుతున్న టీజీ వెంకటేష్

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు బోధనలు, ఆయన అనుసరించిన మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీ యమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. నగరంలోని మౌర్య ఇన్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో, నగరంలోని పాస్టర్లతో క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తప్పులు చేసినవారు సరిదిద్దుకొని సరైన మార్గంలో నడుచుకుంటే దేవుని దీవెనలు ఉంటాయని అన్నారు. పాస్టర్లు ప్రసాద్, శ్యామేల్, ఏసుబాబు, అవిలాన్ బాబు పాల్గొన్నారు.

శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి విరాళం



దాతకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

శ్రీశైలం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి భక్తులు విరాళాలు అందజేశారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మల్లికార్జున సురంగి అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి రూ. 1,01,116 ల విరాళాన్ని, బెంగళూరుకు చెందిన ఎన్. రాజారెడ్డి అనే భక్తుడు రూ. లక్ష విరాళాన్ని పర్యవేక్షకుడు మల్లికార్జునకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

ఆశలన్నీ శనగపైనే

- ఉమ్మడి జిల్లాలో 4 లక్షల హెక్టార్లలో సాగు
- రబీలో రారాజుగా నిలుస్తున్న పప్పుశనగ



కొలిమిగుండ్ల మండలంలో కళకళలాడుతున్న శనగ పంట



పురుగు నివారణ కోసం మందు పిచికారీ చేస్తున్న రైతు

కొలిమిగుండ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా రైతుల ఆశలన్నీ ప్రస్తుతం శనగపైనే నెలకొన్నాయి. విస్తారంగా సాగు చేసిన శనగ పంట ప్రస్తుతం పూత దశలో ఆశాజనకంగా ఉండటంతో అన్నదాతల ఆశలు రెట్టింపు అవుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సాగు రైతన్నలకు కష్టాలనే మిగిల్చింది. కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పూర్తి స్థాయిలో సాగుకు నోచుకోకపోవడం, మరి కొన్ని ప్రాంతాల్లో సాగుచేసిన పంటలు ఎండి పోవడం, ఇంకొన్ని ప్రాం తాల్లో అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్న విభిన్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఖరీఫ్ సాగు అన్నదాతలకు తీవ్ర ఆవేదన మిగిల్చింది.

రబీలో పప్పు శనగవైపే దృష్టి

ప్రధాన వాణిజ్య పంట అయిన పప్పు శనగ ఉమ్మడి జిల్లాలో రబీ రారాజుగా నిలుస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా రబీ సీజన్ సాధారణ సాగులో 3వ వంతు పప్పు శనగ పంటను రైతులు సాగు చేస్తున్నారు. దీన్ని బట్టి శనగ సాగుపై ఉమ్మడి జిల్లా రైతుల ఆశలు ఏవిధంగా ఉన్నాయో అర్థమతోతుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 4 లక్షల హెక్టార్లు పప్పు శనగ సాగు అయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పప్పు శనగ పంట నమోదు కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. ఇందులో అత్యధికంగా నంద్యాల జిల్లాలోని కోవెలకుంట్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ వ్యవసాయ సబ్ డివిజన్‌లలో పప్పు శనగ సాగు చేశారు.

వర్షాల వల్ల కళకళలాడుతున్న పంటలు

ఇటీవల బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కురిసిన చిన్నపాటి వర్షాలతో శనగ పంట ఆశాజకంగా మారింది. శనగ సాగు చేసిన తరువాత వర్షం లేక పోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. అయితే తుఫాన్ కారణంగా కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదు కాగా, మరికొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. అయితే ఈవర్షం కొన్ని పంట లకు తీవ్ర నష్టం కలిగించగా, పప్పు శనగకు మాత్రం ఎంతో మేలు చేసిందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పూత దశకు చేరుకున్న శనగ పంట కళకళలాడుతోది. తుఫాన్ వర్షంతో శనగ పంట మరింత ఎదుగుదల వస్తోందని, అన్నీ అనుకూలిస్తే శనగ రైతుల పంట పండినట్టేనని పలువురు అంటున్నారు.

మూడెకరాల్లో సాగు చేశాను



మూడు ఎకరాల్లో శనగ పంట సాగు చేశారు. సుమారు రూ.50వేలు పెట్టుబడి పెట్టాను ప్రస్తుతం శనగ పంట ఆశాజనకంగానే ఉంది. **- మార్కె శ్రీరాములు, మీర్జాపురం**

పంట పూత దశలో ఉంది



ఇటీవల కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాలు శనగ పంటకు ఎంతో మేలు చేశాయి. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. ఎటువంటి వైపరీత్యాలు లేకుంటే దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉంది.

- ఆవుల సూర్యనారాయణరెడ్డి, రైతు, కొలిమిగుండ్ల

నాలుగు వాహనాల సీజ్

మంత్రాలయం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీఓ అధికారులు గురువారం రికార్డులు లేని నాలుగు వాహనాలను సీజ్ చేసి మాధవరం, మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో అప్పగిం చారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థం తెలం గాణ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల నుంచి అనుమతులు లేకుండా వాహనాలు వస్తే సీజ్ చేస్తామని ఆదోనీ ఆర్టీవో కేఎండీ ఆవాజ్ అన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ సరిగ్గా రికార్డులు ఉండాలని తెలిపారు. తనిఖీల్లో మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్, వీరేష్, వీరాంజనేయులు, భాస్కర్ పాల్గొన్నారు.

18న హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బి.క్యాంపు క్రీడా మైదానంలో ఈనెల 18న జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ మహిళా జట్టుకు క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పి.సువర్ణ గురువారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ చాంపి యన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

'మోహన్‌బాబుపై కేసు నమోదు చేయాలి'



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఓ చానల్ రిపోర్టర్‌పై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఐజేయూ జాతీయ సమితి సభ్యులు గోరంట్ల కొండప్ప, కె.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవాధ్యక్షుడు ఎన్వీ సుబ్బయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాస గౌడ్ డిమాండ్ చేశారు. మోహన్‌బాబు దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం కర్నూలు కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద ఏపీయూడ బ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన తెలిపారు జేఏసీ నాయకులు టీజీ ప్రసాద్, ఏపీడబ్ల్యూజేఎఫ్ కన్వీనర్ నాగేంద్ర, ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, సాయికు మార్ నాయుడు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. జిల్లా కోశాధికారి అంజి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ నాయకులు చంద్రశేఖర్, నాగిరెడ్డి, హరికిషన్, సురేష్, సుంకన్న, హుస్సేన్, ఖలీల్, మధుసూదన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శి అవినాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, భాస్కర్, నాగేంద్రప్రసాద్, వీడియో జర్నలిస్టులు మోహన్, రాజు, చంద్రశేఖర్, సురేంద్ర, శివ, రమేష్ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గ్రామాభివృద్ధి: డీపీవో



మాట్లాడుతున్న డీపీవో భాస్కర్

ఓర్వకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని డీపీవో భాస్కర్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాలులో స్వయం సమృద్ధి లక్ష్యాలు అనే అంశంపై మండల అధికారులకు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ ఉద్యోగులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మొదటి రోజు శిక్షణ కార్యక్రమాన్ని డీపీవో భాస్కర్, ఎంపీడీవో శ్రీనివాసులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ శిక్షణకు రిసోర్స్‌పర్సన్లుగా గోపాల్ వ్యవహరించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రేపు సాహితీ సదస్సు

కర్నూలు కల్చరల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని సాహితీ సదస్సు సంస్థ, తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు సదస్సు ఏర్పాటు చేసినట్లు కో-ఆర్డినేటర్ డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మద్దూర్‌నగర్‌లోగల పింగళి సూరన తెలుగుతోట సమావేశ హాలులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దివంగత పండుగ సుబ్బారెడ్డి పేర స్మారకో పన్యాసం 'సురవరం ప్రతాపరెడ్డి గారి సాహిత్య సేవ' అనే అంశంపై ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్, సభాధ్యక్షుడిగా గాడిచర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర హాజరవుతారని ఆమె తెలిపారు. వక్తగా డాక్టర్ తొగట సురేష్‌బాబు, సభను సాహితీ సదస్సు కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ ప్రారంభిస్తారన్నారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతలకు సత్కార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు దండెబోయిన పార్వతీదేవి తెలిపారు.

నేటి నుంచి దత్త జయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పాతనగరంలోని దక్షిణ షిరిడీగా వినతికెక్కిన సాయిబాబా దేవస్థానంలో శుక్రవారం, శనివారం దత్త జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం పాలక మండలి కార్యదర్శి ఇ.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి శనివారం ఉదయం 7.30 గంటల వరకు అఖండ సాయినామ భజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. శనివారం దత్త జయంతి సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు, మహాహారతి కార్యక్రమాలు ఉంటాయని, అనంతరం భక్తులకు అన్నదానం చేస్తారని ఆయన తెలిపారు.

పండ్లతోటల సాగుపై దృష్టి సారించాలి

సి.బెళగల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సన్నకారు రైతులు పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని కోడుమూరు ఉద్యాన వన శాఖ అధికారి మధుసూదన్‌గౌడు అన్నారు. గురువారం ఇనగండ్ల, పోలకల్లు, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లో సన్నకారు రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లతోటలను పెంచుకునే రైతులకు ప్రభుత్వం యాభై శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. హార్టికల్చర్ అసిస్టెంట్లు చెంచురాజు, నాగన్న, రైతులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం డబ్బులు వసూళ్లు

● రైతుల ఆవేదన

సి.బెళగల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు, బ్యాథోలి, బ్రాహ్మణ దొడ్డి, మారందొడ్డి, బురాన్‌దొడ్డి, క్రిష్ణదొడ్డి, గ్రామాలలో రైతులు ఎల్లెల్సీ కింద వేరుశనగ, మిరప, ఉల్లి, పత్తి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్న రైతులు సాగునీటి కోసం డబ్బు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. పైసలు చెల్లించిన వారికే సాగునీరు విడుదల చేస్తున్నట్లు ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లెల్సీ అధికారులు దళారులను ఏర్పాటు చేసుకొని డబ్బులు ఇచ్చిన రైతులకు మాత్రమే సాగునీరు వదలమని వర్క్ ఇన్‌స్పెక్టర్లు, లస్కర్లకు ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకుని ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని ఎల్లెల్సీ ఉన్నతాధికారులను ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఎల్లెల్సీ ఏఈ సూర్యప్రకాశ్ వివరణ కోరగా రైతుల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయం తమ దృష్టికి రాలేదని చెప్పారు. విచారణ చేసి ఉన్నతాధికారులకు రిపోర్టు చేస్తానని తెలిపారు.

ప్రతి భూసమస్యకు పరిష్కారం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో ప్రతి భూసమస్యకు పరిష్కారం చూపేందుకే అధికారులు ప్రజల వద్దకు వస్తున్నారని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. గురువారం మండలంలోని కాల్వ గ్రామంలో రెవెన్యూ సదస్సుకు ఎమ్మెల్యేతోపాటు నంద్యాల టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ హాజరయ్యారు. అంతకుముందు ఉపాధి హామీ పథకం నిధులు రూ.15లక్షలతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి ఎమ్మెల్యే పనులు ప్రారంభించారు. అనంతరం రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. రెవెన్యూ సదస్సులో భూతగాదాలు, భూఆక్రమణ తదితర వాటిపై అర్జీలు కుప్పలు తెప్పలుగా వచ్చాయి. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో గ్రామంలోని నాయకులు పేదల భూములను దౌర్జన్యం గా ఆక్రమించుకుని రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన భూఆక్రమాలను వెలికితీసి ప్రజలకు న్యాయం చేస్తా మన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి త్వరగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వైసీపీ పాలనలో ఎన్నికల ముందు మండలంలో ఇష్టానుసారంగా ఇంటి పట్టాలు ఇచ్చారని, వాటన్నింటిని రద్దు చేసి అర్హులకు అందిస్తామని అన్నారు. కాల్వబుగ్గ గ్రామంలో అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. మండలంలో పరిశ్రమలు రావడంతో వైసీపీ పాలనలో భూ ఆక్రమణలు విచ్చలవిడిగా కొనసాగాయని వాటిపై విచారణ చేపడతామన్నారు. కార్యక్రమంలో డీపీవో భాస్కర్, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎస్ఐ సునీల్ కుమార్, ఎంపీటీసీ నాగిరెడ్డి, నాయకులు రజాక్‌బాషా, ఖాదర్‌బాషా, మహబూబ్ బాషా, కేవీ మధు, లక్ష్మణ్ నాయక్, మౌళీశ్వరరెడ్డి, ఆయా శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యలు వైసీపీ ప్రభుత్వ నిర్వాకమే: ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు రూరల్: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకమే అని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి విమర్శించారు. గురువారం కోడుమూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రెవెన్యూ రికార్డుల్లో చాలా తప్పులు జరిగాయని ఆరోపించారు. భూ సమస్యలపై వస్తున్న ఫిర్యాదులే ఇందుకు నిదర్శనమన్నారు. దీంతో సీఎం చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందన్నారు. రైతులు భూ సమస్యలపై దరఖాస్తులు చేస్తే అధికారులు 45 రోజుల్లోగా పరిష్కారం చూపుతారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏడీఏ షాలురెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు మల్లికార్జున గౌడు, పట్టణ అధ్యక్షుడు యల్లప్ప నాయుడు, నాయకులు గోపాల్ నాయుడు, రవీంద్రగౌడు, బలరాం, గంగాధర్, ఇంతియాజ్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి

● **ఎమ్మెల్యేను సత్కరించిన సర్పంచ్ దంపతులు:** ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని సర్పంచ్ భాగ్యరత్నమ్మ, ఆంధ్రయ్య దంపతులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా కోడుమూరు పట్టణంలో పలు సమస్యలను సర్పంచ్ దంపతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం పైపులైన్ ఏర్పాటు, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా డ్రైనేజీల ఏర్పాటుకు సహకరించాలని కోరారు.

సి.బెళగల్: భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని మండల ప్రత్యేక అధికారి శ్యామల అన్నారు. గురువారం మండలంలోని కొండాపురం గ్రామంలో వీఆర్వో రంగముని అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రెవెన్యూ సదస్సుకు 10 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి తెలిపారు, కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పురుషోత్తం, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సర్వేయర్ నాగభూషణం, వీఆర్వోలు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి



ఐసీడీఎస్ పీడీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు హస్పిటల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెకాలపు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మకు అంగన్‌వాడీ వర్కర్లు యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. గురువారం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జే.లలితమ్మ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, సీఐటీయూ రాష్ట్ర నాయకులు నిర్మలమ్మ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ, సీఐటీయూ నగర నాయకులు మహ్మద్‌రఫీ ఐసీడీఎస్ పీడీని కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలితమ్మ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలని, విధి నిర్వహణలో చనిపోయిన అంగన్‌వాడీలకు రూ.20వేలు మట్టిఖర్చులు, కుటుంబంలో ఒకరికీ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. అంగన్ వాడీ సెంటర్లకు ఉచిత గ్యాస్ సరఫరా చేయాలని, అర్హత కలిగిన ఆయాలకు పదోన్నతులు కల్పించాలని, ఖాళీగా ఉన్న 163 సూపర్‌వైజర్ల పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కార్మికుల జీతాలు పెంచాలని కోరుతూ చేస్తున్న సమ్మె గురువారానికి నాలుగో రోజుకి చేరింది. ఈ మేరకు నగర పాలక కార్యాలయం నుంచి కొండారెడ్డి బురుజు వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ టెక్నికల్, నాన్ టెక్నికల్ కార్మికులకు జీతాలు పెంచాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, చనిపోయిన కార్మికుని కుటుంబంలో ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి జే.రమేష్, జిల్లా అధ్యక్షుడు ఎస్.మనోహర్, నగర అధ్యక్షుడు జి.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి జావిద్, కాశపోగు జ్ఞానమ్మ పాల్గొన్నారు.

ఐఎస్పీఎల్‌కు గోరంట్ల క్రీడాకారుడు



క్రికెటర్ హనుమంతరెడ్డి

కోడుమూరు రూరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్ల గ్రామానికి చెందిన యువ క్రికెటర్ హనుమంతరెడ్డి ఐఎస్పీఎల్ క్రికెట్‌కు ఎంపికయ్యారు. హిందీ హీరో అజయ్ కుమార్ యజమానిగా ఉన్న శ్రీనగర్ మహవీర్ టీం వేలంలో బేస్ ప్రైజ్ రూ.3లక్షలకు హనుమంతరెడ్డిని కొనుగోలు చేసింది. బుధవారం రాత్రి ఈ వేలం జరిగింది. వచ్చే ఏడాది జనవరి 25 నుంచి ముంబైలోని థానే స్టేడియంలో క్రికెట్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఐఎస్పీఎల్‌కు ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండుల్కర్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా గురువారం వైజాగ్ స్ట్రీట్ ప్రీమియర్ లీగల్‌లో పోలమాంబ లెవెన్ టీం తరుపున హనుమంతరెడ్డి ఆడారు. పోలమాంబ టీం రూ.5లక్షల నగదు బహుమతిని కైవసం చేసుకున్నట్లు క్రికెటర్ హనుమంతరెడ్డి గురువారం తెలిపారు. ఈసందర్భంగా హనుమంతరెడ్డిని గ్రామస్థులు అభినందించారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా



టీడీపీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న నాయకులు

గూడూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా ఉంటుందని నగర పంచాయతీ మాజీ వైస్ ఛైర్మన్ రామాంజనేయులు అన్నారు. గురువారం గూడూరు పట్టణంలో జిల్లా మైనార్టీ టీడీపీ కార్యదర్శి డా.మన్సూన్ బాషా ఆధ్వర్యంలో పడకానా వీధిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా నగర పంచాయతీ మాజీ వైస్ ఛైర్మన్ రామాంజనేయులు హాజరయ్యారు. ఆయన ఇంటింటికీ వెళ్లి టీడీపీ సభ్యత్వం చేసుకున్న కార్యకర్తలకు పార్టీ కల్పిస్తున్న లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కూరగాయల చాంద్‌బాషా, క్రిష్ణ, వలి పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై భారం

సుందరయ్య కూడలిలో విద్యుత్ బిల్లులు దహనం

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవకముందే విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై భారం వేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు పీఎస్. రాధాక్రిష్ణ అన్నారు. పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ గురువారం సుందరయ్య కూడలిలో బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పేరుతో రూ.20 వేల కోట్లు ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపుతూ స్వర్ణాంధ్ర నిర్మిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూప్ చార్జీలను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి టి.రాముడు, నాయకులు పి.నరసింహ, నగేష్, సాయి బాబా, మహ్మద్ రఫీ పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లులతో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ప్రజలు సంతృప్తి చెందేలా పని చేయండి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సచివాలయాలకు వచ్చే ప్రజలు సంతృప్తి చెందేలా సిబ్బంది పని చేయాలని నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సూచించారు. గురువారం ఎన్ఆర్‌పేటలోని 125, 126 సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్లను కమిషనర్ పరిశీలించారు. ఎంఎస్ఎంఈ సర్వే, పన్ను వసూళ్లపై కమిషనర్ ఆరా తీవారు. అలాగే జిల్లా కోర్టు, మున్సిఫ్ కోర్టుల ప్రాంగణాలను ఆయన పరిశీలించారు. న్యాయవాదుల అభ్యర్థన మేరకు పార్కింగ్, ఫుట్‌పాత్, పారిశుధ్య పనులకు సంబంధించి పలు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కొండారెడ్డిబురుజు, పెద్దమార్కెట్, జమ్మిచెట్టు ప్రాంతాలలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన వెంట ఆరోగ్య అధికారి డాక్టర్ కే.విశ్వేశ్వరరెడ్డి, డీఈఈ కృష్ణలత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మునిస్వామి ఉన్నారు.



సచివాలయంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న కమిషనర్

సమ్మెను విరమించేది లేదు



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

గూడూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించేది లేదని గూడూరు నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు మధు, లూకేశ్వరరావు, అరవిందు, బసవరాజు అన్నారు. గురువారం గూడూరు పట్టణంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె నాల్గవ రోజుకు చేరుకుంది. గురువారం ఇంజనీరింగ్ కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఇంజనీరింగ్ కార్మికులు షబ్బీర్ బాషా, ఆల్లీబాషా, జయన్న ఆంజనేయులు, హరి, వెంకటేశ్వర్లు, ఖాజా హుశేన్, మధు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తొమ్మిది బాక్సుల కర్ణాటక మద్యం, ఆరు బాక్సుల తెలంగాణ మద్యం, 40 లీటర్ల నాటు సారా, 500 కేజీ నల్ల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ చంద్రహసన్ తెలిపారు. గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించారు. బళ్లారి చౌరస్తా వద్ద ఆటో తనిఖీ చేయగా బిర్లాగేట్‌కు చెందిన బోయ విజయ్, బాలాజీ నగర్‌కు చెందిన బోయ రంగన్నలను అదుపులోకి తీసుకోగా, బోయ వెంకటేశ్వర్లు పరారీలో ఉన్నారని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు రెహన బేగం, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు రామలింగయ్య, చంద్రపాల్ పాల్గొన్నారు.

అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఇన్‌చార్జి ఉపకులపతికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్, పూలే, గాంధీ, జగ్జీవన్‌రామ్‌ల అధ్యయన కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర నిరుద్యోగ ఫోరమ్ జేఏసీ అధ్యక్షుడు శ్రీరాములు డిమాండ్ చేశారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలో ఇన్‌చార్జి ఉపకులపతి ఎన్‌టీకే నాయక్‌ను శ్రీరాముల తోపాటు నవ్యాంధ్ర జేఏసీ అధ్యక్షుడు అయ్యాస్వామి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీలోని పేద విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు స్టడి సర్కిల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఇన్‌చార్జి ఉపకులపతి రాష్ట్ర ప్రభుత్వానికి, యూజీసీకి లేఖ రాసీ తక్షణమే వాటి ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఆదాయమార్గాలపై ప్రత్యేక దృష్టి



పెట్రోలు బంకు సిబ్బందితో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు ఆదాయ పెంపునకు మార్గాలను అన్వేషించాలని నగర పాలక అడిషన్ కమిషనర్ ఆర్‌జీవీ.కృష్ణ అధికారులకు సూచించారు. గురువారం పాత బస్టాండు కేఎంసీ పెట్రోలు బంకు, పెద్దమార్కెటు వద్ద మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. పెట్రోలు బంకులో పలు రిజిస్టర్లను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. గత కొంతకాలంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఆర్‌ఓ జునైద్, ఆర్ఐ శేషాద్రి, ప్రత్యేక అధికారి జీఎం.శ్రీకాంత్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడిగా రవిప్రకాష్ రెడ్డి

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ జిల్లా వర్కింగ్ అధ్యక్షుడిగా వి.రవిప్రకాష్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం అధ్యక్షుడు, ఎన్వీ కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి ధనుంజయ గురువారం తెలిపారు. ఈసందర్భంగా రవిప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు సంకల్ప్-2025 కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు బీ, సీ కేటగిరీలుగా గుర్తించి గురువారం ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచాలనే ఉద్దేశంతో ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతిక శుక్ల ఆదేశాల మేరకు ఒకేషనల్ కళాశాలలో చదివే విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశామని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రసన్న కుమార్, విజయశేఖర్, పార్థసారధి పటేల్, లక్ష్మి, చిన్నమల్లేశ్వరుడు, ఉల్లోజిరావు, నాన్ టీచింగ్ సిబ్బంది సత్యానందం, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.



రాయపాటి శ్రీనివాస్‌కు అంతర్జాతీయ అవార్డులు



కర్నూలు కల్చరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన లయన్స్ క్లబ్ నిర్వాహకుడు, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు యూఎస్ఏ, నైజీరియా దేశాల నుంచి అంతర్జాతీయ స్థాయి అవార్డులు అందుకున్నారు. నైజీరియా దేశానికి చెందిన గుడ్ సమారిటన్ థియలాజికల్ సెమినరీ అండ్ పీస్ అకాడమీ చాన్స్‌లర్, ఆర్చి బిషప్ అంబాసిడర్ డాక్టర్ జేపీ అదేహెరాల్డ్ నైజీరియా దేశం నుంచి అవార్డు ప్రకటించి ఇంటర్‌నెట్ ద్వారా అందజేశారు. అలాగే యూఎస్ఏకు చెందిన మైక్‌వర్సిటీ ఇంటర్నేషనల్ సీఈఓ మైక్ లిటమన్ సేవా రంగాల్లోని వారికి ఏటా ప్రదానం చేస్తున్న అంతర్జాతీయ పురస్కారం డాక్టర్ రాయపాటి శ్రీనివాస్‌కు ప్రకటించి ఇంటర్‌నెట్ ద్వారా అందజేశారు. ఈసందర్భంగా రాయపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ గురువారం అంతర్జాతీయ అంతర్జాల సమావేశంలో ఈ అవార్డులను తనకు ప్రకటించడం సంతోషంగా ఉందని చెప్పారు. గత ముప్పయ్ ఏళ్లుగా తాను లయన్స్ క్లబ్, నైస్ యూత్ సంస్థల ద్వారా చేపట్టిన విద్య, ఉపాధి, సమాజిక సేవ, న్యాయ విజ్ఞాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు, సామాజిక సమస్యలపై అవగాహన కార్యక్రమాలను గుర్తించి ఈ అవార్డులు ప్రకటించి, అంతర్జాలం ద్వారా గురువారం అందజేశారని తెలిపారు.

ఆర్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిగా మహేష్

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రిపబ్లికన్ స్టూడెంట్ ఫెడరేషన్(ఆర్ఎస్ఎఫ్) నూతన జిల్లా కార్యదర్శిగా మహేష్‌ను నియమించినట్లు ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు రాజేష్ ప్రవీణ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ప్రసూన లా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: ఎంపీడీవో



మాట్లాడుతున్న ఎంపీడీవో రాణెమ్మ


సి.బెళగల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రాణెమ్మ హెచ్చరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం సమావేశం భవనంలో తాగునీరు, వైద్య, విద్య, రోడ్లు తదితర వాటిపై అధికారులు పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈసమావేశంలో ఈవోఆర్డీ ఈశ్వరస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, విద్యుత్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, వెంకట్‌ప్రకాశ్, సూకుమార్, సుమంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బడి పిల్లలకు ముప్పు



వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ప్రధాన రహదారిపై మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. సమీపంలో ఎంపీపీ పాఠశాల ఉంది. నిత్యం విద్యార్థులు ఈ దారిలోనే పాఠశాలకు వెళుతుంటారు. ఏమాత్రం అదుపు తప్పినా చిన్నారులకు ప్రమాదం సంభవించే అవకాశముంది. అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌ను మూసేయాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. - వెల్దుర్తి.

పొంచి వున్న ముప్పు



హొళగుంద మండలం మార్లమడికి గ్రామంలోని అయ్యప్ప ఆలయం వద్ద రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు ముళ్లకంప తీగలు అల్లుకున్నాయి. వర్షాలు కురిస్తే ముళ్ల కంపకు విద్యుత్ సరఫరా అయి మూగజీవాలకు ముప్పు పొంచి ఉంది. విద్యుత్ అధికారులు ముళ్లకంపను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. విద్యుత్ ఏఈ ఓబులమ్మ వివరణ కోరగా ముళ్లకంప తొలగిస్తామని తెలిపారు.
- హొళగుంద

ఆర్థిక సాయం

ఆదోని రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలం లోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన బుడగ జంగాల కడమంచి హంపయ్య గురువారం మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సహకారంతో కాంట్రాక్టర్ బసవరాజు రూ.5వేలు అందించారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి ఉమాదేవి

మద్దికెర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ప్రత్యేక అధికారి ఉమాదేవి, తహసీల్దార్ హుశేన్‌సాహెబ్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం జడ్పీ బాలికల పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని అన్నారు. మధ్యాహ్న భోజనలో అవినీతి చోటుచేసుకుంటే సహించమని హెచ్చరించారు. హెచ్ఎం దేవేంద్రప్ప, ఆర్ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి, తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల రాస్తారోకో



పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

ఆదోని టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ కార్మికులు గురువారం భీమాస్ కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. తమ కనీస డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని యూనియన్ నాయకులు అహమ్మద్ హుసేన్, పీరా, సోమన్న ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీవితాలతో బ్రతుకులను వెళ్లదీస్తున్న కార్మికుల పరిస్థితి చూడాలన్నారు. కృష్ణమూర్తి, కరెన్న పాల్గొన్నారు.

నేటి నుంచి ముని రంగస్వామి, తిమ్మగురుడు ఉత్సవాలు



మునిరంగ స్వామి ఆలయం

తుగ్గలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగనాయునిదొడ్డి గ్రామ సమీపంలో నేటి నుంచి ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ముని రంగస్వామి, తిమ్మగురుడు రథోత్సవం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతి ఫక్కీరప్పస్వామి తెలిపారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, 15న ఉదయం తిమ్మగురుడు, సాయంత్రం ముని రంగస్వామి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు

15న రాతిదూలం పోటీలు : ఈ నెల 15 నుంచి రాతిదూలం పోటీలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు తలారి రాముడు, దేవేంద్ర తెలిపారు. 8008020820ను సంప్రదించాలన్నారు.

జర్నలిస్టుల రక్షణకు చట్టం తేవాలి

పత్తికొండ టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక చట్టాన్ని తేవాలని ఏపీయుడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షుడు రంగన్న, గౌరవాధ్యక్షుడు షాలురంగడు డిమాండ్ చేశారు. నటుడు మోహన్‌బాబు మీడియా ప్రతినిధిపై దాడిచేయడాన్ని నిరసిస్తూ వద్ద ధర్నా చేసి, అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం ఇచ్చారు.

కార్యకర్తల సంక్షేమానికి రూ.కోట్లు ఖర్చు



మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతినాయుడు

ఆదోని, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమానికి టీడీపీ రూ. కోట్లలో ఖర్చు చేస్తోందని ఆ పార్టీ నాయకుడు ఉమాపతి నాయుడు అన్నారు. గురువారం పెద్ద తుంబళం గ్రామంలో టీడీపీ సభ్యత్వం నమోదు నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉమాపతి నాయుడు మాట్లాడుతూ కుటుబంలోని వారంతా రూ.100తో టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. రూ. 5లక్షల ప్రమాద బీమా, కుటుంబ సభ్యులకు విద్య, ఉద్యోగ, వైద్య సాయం అందుతుందన్నారు. రామస్వామి, సాధికబేగం, శ్రీదేవి, కృష్ణారెడ్డి, బసవరాజు, నాగరాజు, సయ్యద్ బాషా, వీరేష్, శంకర్, అన్వర్ బాషా, విరుపాక్షి, పరీఫ్, నాగరాజు, కాశమయ్య, రామ్ రెడ్డి, నరసప్ప పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి: సీపీఎం



ఆలూరులో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న నాయకులు

ఆలూరు రూరల్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ప్రాంతీయ కన్వీనర్ హనుమంతు, నాయకులు నారాయణ స్వామి, షాకిర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం అవలంభించిన విధానాన్నే కూటమి ప్రభుత్వం కూడా అవలంభిస్తుందని ఆరోపించారు. కృష్ణ, మైన, ఆగ్రహారం ఈరన్న, శ్రీను, నాగరాజు, శివ పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి

ఆలూరు రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగుల సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పత్తికొండ డీఎల్‌పీవో వీరభద్రప్ప, ఎంపీడీవో సూర్య నారాయణ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సమృద్ధి లక్ష్యాలపై ఈవోఆర్డీ ప్రభాకర్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేయాలన్నారు. మౌలిక సదుపాయం, నీటి సమృద్ధి, పరిశుభ్రత, సామాజిక భద్రతపై దృష్టి సారించాలని సూచించారు. పేదరికం లేని గ్రామాలుగా తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంపీపీ రంగమ్మ, ఏవో రమాదేవి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి విజయ, జీలన్, వెంకటనాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి

వెల్దుర్తి టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు మాజీ ఎంపీపీ, టీడీపీ నాయకుడు జ్ఞానేశ్వర్‌గౌడ్ అన్నారు. గురువారం కస్తూర్బా పాఠశాలలో ప్రహరీ నిర్మిస్తున్నామన్నారు. బాలికల పాఠశాలలో వివిధ పనులకు నిదులు మంజూరయ్యాని తెలిపారు. హెచ్ఎంలు షబానా బేగం, చంద్రావతి పాల్గొన్నారు.

విద్యుత్ ఆదా చేసుకోండి

మద్దికెర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూర్య ఘర్‌తో విద్యుత్ ఆదా చేసుకోవాలని ఏడీఈ ఖాజావలి సూచించారు. గురువారం విద్యుత్ సబ్ స్టేషన్‌లో రైతులు, వినియోగదారులతో సమావేశం నిర్వహించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పగలు వీధి బల్బులు వెలగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఏఈ మహేశ్వరరెడ్డి, జడ్పీటీసీ మురళిధర్ రెడ్డి, టి.వెంకటేశ్వరరెడ్డి, కేశవులు, విద్యుత్ సిబ్బంది, రామాంజనేయులు, రమణ, శేషు, బీఎన్ పేట రామచంద్ర ఉన్నారు.

సమాచారం ఇవ్వకుండా సదస్సు

హొళగుంద, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను అధికారులు ఇష్టమొచ్చినట్లు నిర్వహిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెబ్బటం గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అయితే అధికారులు ముందుగా తెలప కుండా, కేవలం బుధవారం రాత్రి దండోరా వేయించారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ సతీష్‌ను వివరణ కోరగా వీఆరోవకు వారం క్రితమే సమాచారం ఇచ్చామని, అయన బుధవారం రాత్రి దండోరా వేయించినట్లు తెలిపారు.

రోడ్డు పనుల ప్రారంభం

వెల్దుర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రామళ్లకోట గ్రామంలో సీసీ రోడ్డు పనులను టీడీపీ నాయకుడు మాచిరెడ్డి శశి గురువారం ప్రారంభిం చారు. పత్తికొండ ఎమ్మెల్యే కే శ్యాంబాబు సహకారంతో రూ.10 లక్షలతో పనులు చేస్తున్నామన్నారు. ఖాజామోద్దీన్, బాబు గౌడ్, ఎంపీటీసీ నాగలక్ష్మమ్మ, మాధవ స్వామి, రమణ, బుజ్జి, వెంకటేశ్వర్లు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుగ్గలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటు ందని ఏఈ మహేశ్వరరెడ్డి గురువారం అన్నారు. శుక్ర, శనివారాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తుగ్గలి, జొన్నగిరి సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేస్తున్నామని సహకరించాలని కోరారు.

ఆదర్శంగా మార్చాలి

హాలహర్వి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పంచాయతీలుగా మార్చాలని ఎంపీడీవో వరలక్ష్మి సూచించారు. గురువారం ఏర్పాటు చేసిన శిక్షణలో మాట్లాడారు. పంచాయ తీల్లో సదుపాయాలు కల్పించి, అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కోరారు.

'సమస్యల పరిష్కారానికే రవెన్యూ సదస్సులు'

ఆదోని రూరల్ డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహసీల్దార్ శివరాముడు అన్నారు. గురువారం బసాపురం, నాగనాథనహళ్ళి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

ఆదోని వాసికి అవార్డు



అవార్డు అందుకుంటున్న కమలనాభ శర్మ

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన జ్యోతిష్యుడు కమలనాభ శర్మ రాష్ట్ర జ్యోతిష్య వాస్తు పండిట్ అవార్డును అందుకున్నారు. తిరుపతిలోని టీటీడీ ఆడిటోరియంలో ఎస్ఎస్ జ్యోతిష్య పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో ప్రదానం చేసినట్లు కమలనాభ శర్మ తెలిపారు. సంస్థ అధిపతి డాక్టర్ నరసింహకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మరుగు దొడ్లు నిర్మించండి : ఎమ్మెల్యే



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహిళలకు మరుగుదొడ్లు నిర్మించాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థ సారథి కోరారు. గురువారం విజయవాడలోని 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో మరుగు దొడ్లు నిర్మిస్తానని ఎన్నికల్లో చేస్తామని హామీ ఇచ్చానని, నిధులు విడుదల చేయాలని కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే అన్నారు.

20న దుకాణాల వేలం



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ

ఆలూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండలం పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన 18 దుకాణాలకు ఈనెల 20న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రంగమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ గురువారం తెలిపారు. క్రింద షాప్స్‌కు 3వేలు, పైషాప్స్‌కు రూ.2వేలు ప్రభుత్వం ధర నిర్ణయించారు. వేలంలో పాల్గొనదలచినవారు రూ.30 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఇందులో బీసీ 5, ఎస్టీ 1, ఎస్సీ 3 దుకాణాలు రిజర్వేషన్ కల్పించామని అన్నారు. మిగతా వాటిని జనరల్‌కు కేటాయించామని తెలిపారు.

సమావేశంలో పత్తికొండ డివిజనల్ పంచాయతీ అధికారి వీరభద్ర, సూపరిండెంట్ రమాదేవి పాల్గొన్నారు.

'టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా'



బురుజులలో సభ్యత్వం చేస్తున్న టీడీపీ నాయకులు

మద్దికెర, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): టీడీప సభ్యత్వంతో కుటుంబానికి భరోసా ఉంటుందని ఆ పార్టీ నాయకుడు మండల మాజీ ఉపాధ్యక్షుడు ఎర్రిస్వామి, సోషల్ మీడియా కన్వీనర్ హుశేన్‌పీరా, బురుజుల మోహన్ అన్నారు. గురువారం బురుజుల గ్రామంలో సభ్యత్వాలు చేపట్టారు. వీరేష్, ఉరుకుంద, శ్రీనివాస్, రంగస్వామి తదితరులు ఉన్నారు.





రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి

ఆలూరు రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని తహసీల్దార్ గోవింద్ సింగ్ అన్నారు. గురువారం కార్యాలయ ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సమస్యలున్న రైతులు దరఖాస్తు ఇవ్వాలని కోరారు. డీటీ విజయకుమార్, సర్వే యర్ అరుణ జ్యోతి. వీఆర్వోలు రామంజనేయులు,మహేంద్ర, రవికుమార్ పాల్గొన్నారు.

పదోన్నతులు ఇవ్వాలి

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పురపాలక పాఠశాలల ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని యూటీఎఫ్ పట్టణ అధ్యక్షుడు సునీల్ రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. ఏళ్లతరబడి పనిచేసినా పదోన్నతులు రాకుండానే పదవీ విరమణ చేస్తున్నారని అన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి



వివరాలను పరిశీలిస్తున్న ఖజానా అధికారి రామచంద్రరావు

- జిల్లా ఖజానా అధికారి రామచంద్ర రావు

ఆలూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పెన్షనర్లు సకాలంలో లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని జిల్లా ఖజానా శాఖ అధికారి రామచంద్ర రావు కోరారు. గురువారం ఆలూరు ట్రెజరీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనారోగ్యంతో నడవలేని వారు వీడియో కాల్ ద్వారా ట్రెజరీ సిబ్బందికి కాల్ చేసి లైఫ్ సర్టిఫికెట్‌ను జిల్లాలోని ఏ ట్రెజరీ లోనైనా సమర్పించే అవకాశం ఉందని తెలిపారు. అలా చేయలేని వారు జీవన్ ప్రమాన్ యాప్ ద్వారా సమర్పించాలని సూచించారు. ఆలూరు పరిధిలో ఉన్న 622ఉద్యోగులు జనవరి, ఫిబ్రవరిలోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పిం చాలని సంఘం నాయకులు గోవిందప్పకు సూచించారు.

సూర్య ఘర్ యోజనతో ప్రయోజనాలు

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్
- వినియోగదారులకు అవగాహన సదస్సు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనతో ప్రయోజనాలు ఉన్నాయని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వీఎస్‌బీ పంక్షన్ హాల్‌లో ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పాల్గొన్నారు. సూర్యఘర్ ద్వారా పర్యావరణాన్ని కాపాడినవారవుతారన్నారు. 1 కేవీ లోడ్ 120యూనిట్లకు బిల్లు రూ.వెయ్యి వచ్చేదని, సోలార్‌తో రూ. 338లు మాత్రమే వస్తుందన్నారు. ఏడాదికి రూ.8వేల వరకు పొదుపు చేసుకోవచ్చన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుంటే 1 కేవీకి రూ.30వేలు, 2 కేవీకి రూ.60వేలు అలాగే 3కిలోవాట్లకు రూ..78వేల సబ్సిడీ వస్తుందని సబ్ కలెక్టర్ వివరించారు. ఈ పథకాన్ని ఉపయోగించుకున్న వినియోగదారులు శ్రీనివాసులు, భద్రమూర్తి, గోవిందరాజు, పురుషోత్తంను సన్మానించారు. అనంతరం జాతీయ ఇందన పొదుపు వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణ, విద్యుత్ ఇంజనీర్లు హరి, ఓబులేసు, ఏడీ పురుషోత్తం, ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు పాల్గొన్నారు.

సారా తయారీదారులపై పీడీ యాక్ట్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆదోని ఎక్సైజ్ సీఐ సైదుల్



ఆదోని, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నాటు సారా తయారీదారులపై మూడు కంటే ఎక్కువ కేసులుంటే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ సైదుల్ హెచ్చరించారు. ఆయన ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: కర్ణాటక మద్యాన్ని అరికట్టడా నికి చర్యలు తీసుకుంటున్నారా?

జవాబు: గతంలో ఎక్కువగా ఉండేది ప్రస్తుతం నిఘా ఉంచి 60శాతం వరకు అరికట్టాం. పూర్తిగా అరికట్టేందుకు నిఘా ఉంచాం.

ప్రశ్న: అక్రమ మద్యం రవాణాపై ఎన్ని కేసులు నమోదు చేశారు?

జవాబు: 24 కేసులు నమోదు చేసి, 580 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నాం. ఇందులో 25 మంది నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశాం. 39 లీటర్ల సారా, బెల్లం ఊటను ధ్వంసం చేశాం.

ప్రశ్న: గ్రామాల్లో విచ్చలిడిగా బెల్టు షాపులు ఉన్నట్లు తెలుస్తోంది కదా?

జవాబు: బెల్టు షాపులు నిరవహిస్తే వదిలే ప్రసక్తి లేదు. ఇప్పటికి 10 కేసులు నమోదు చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశాం. 62 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకొని 5 వాహనాలను సీజ్ చేశాం. 4 బైండ్ ఓవర్ కేసులు పెట్టాం.

ప్రశ్న: బార్లు, వైన్స్ షాప్స్ వేళలు ఎలా?

జవాబు: బార్లు, రెస్టారెంట్లు ఉదయం 11గంటల నుంచి రాత్రి 11గంటల వరకు మాత్రమే తెరవాలి. వైన్స్ దుకాణాలు ఉదయం 11 గంటల నుంచి రాత్రి పది గంటల వరకే మద్యాన్ని విక్రయించాలి.

ప్రశ్న: ఆదోనిలో గంజాయి జాడలు ఉన్నాయా?

జవాబు: పట్టణంలో గంజాయిపై నిఘా ఉంచాం సంతేకూడ్లూరు, నాగనాథ నహళ్ళి, నారాయణపురం గ్రామాల్లో సాగు చేస్తున్నట్లు సమాచారం ఉంది. దీనిపై నిఘా ఉంచాం.

సాగు నీటి సంఘాల ఎన్నికలకు సై

నందవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జరిగే సాగునీటి సంఘాల ఎన్నికల్లో పాల్గొనేందుకు ఇరు పార్టీల నాయకులు సై అంటే సై అంటున్నాయి. టీడీపీ తరపున సాగునీటి సంఘం ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డిని ప్రసన్నం చేసుకున్నారు. అందుకు ఎమ్మెల్యే కూడా వారినే అభ్యర్థులుగా ప్రకటిస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మండలంలోని మూడు డిస్ట్రిబ్యూటరీలకు ఎన్నికలు జరగనున్నాయి. మాజీ ఎంపీపీ చిన్న నరసింహారెడ్డి కుమారుడు హాలహర్వి గోవర్ధన్‌రెడ్డిని చిన్నకొత్తిలి డిస్ట్రిబ్యూటరీ చైర్మన్‌గా, అదే గ్రామానికి చెందిన బోయ ఎర్రం నాయుడును గంగవరం డిస్ట్రిబ్యూటరీకి, మిట్టసోమాపురం డిస్ట్రిబ్యూటరీకి కనకవీడు ఈరన్నగౌడు పేర్లను ఎమ్మెల్యేకు రైస్ మిల్ అసోసియేషన్ తాలుకా అధ్యక్షుడు నారాయణరెడ్డి ప్రతిపాదించారు. అందుకు ఎమ్మెల్యే అంగీకరించారు. దీంతో ఎమ్మెల్యే బీవీని అభ్యర్థులు సత్కరించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. మండలంలోని మిగతా డైరెక్టర్లు నందవరం, 28,31. కనకవీడు 32లకు ఆయా గ్రామాల్లోని హైస్కూల్‌లో, నదికైరవాడి 30, గురుజాలలో 33, మిట్టసోమాపురం 37ల డైరెక్టర్లకు ఆయా గ్రామాల్లోని ఎంపీపీ స్కూళ్లలో ఎన్నికలు ఈ నెల 14న న్విహిస్తున్నట్లు ఎల్ఎల్‌సీ ఏఈఈ మణికంఠ తెలిపారు. మండలంలో 3 డిస్ట్రిబ్యూటరీలకు గాను 5 డబ్ల్యూలు ఉన్నాయి. అలా ఒక్కో డబ్ల్యూఏ కింద 12 మంది టీసీ సభ్యులు ఉంటారు. మొత్తం



సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్షిస్తున్న అధికారులు



ఎమ్మెల్యే బీవీని సన్మానిస్తున్న అభ్యర్థులు

వారంతా 60 మంది ఉంటారు. వారందరు కలిసి వాటర్‌యూజర్ అసోసియేషన్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను (డబ్ల్యూఏ)ను ఎన్నుకుంటారు. అలా ఐదుగురు డబ్ల్యూఏలు కలిసి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. మిగతా డిస్ట్రిబ్యూటరీ చైర్మన్లంతా కలిసి తుంగభద్ర డ్యాం చైర్మన్‌ను ఎన్నుకుంటారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై అధికారులతో సమీక్ష

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరు మండలంలో ఆయా డిసెంబరు 14వ తేదీన ఆయా గ్రామాల్లో జరిగే సాగునీటి సంఘాట ఎన్నికలపై తహసీల్దార్ శేషఫణి గురువారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు మండలంలో ఆరువేల మంది సభ్యులు(రైతులు) ఉన్నారన్నారు. నాలుగు వాటర్ యూజర్ అసోసియేషన్లు, రెండు మైనర్ ట్యాంకులకు సంబంధించి ఈ ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 14వ తేదీ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇందుకు సంబందించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఎక్కడా ఎలాంటి సమస్య తలెత్తకుండ అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. సమావేశంలో డీటీ వీరేంద్రగౌడు, రీసర్వే డీటీ జ్యోతిర్మయి, ఎల్లెల్సీ, పోలీసు ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధే టీడీపీ ప్రభుత్వ ధ్యేయం



రైతుల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

కౌతాళం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతుల అభివృద్ధే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని టీడీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్పగౌడ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభ ఇన్‌చార్జి తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డి ఆధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, గ్రామ టీడీపీ నాయకుడు అడివప్పగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రైతుల పొలాలను కొన్ని గ్రామాలలో రీసర్వే చేయగా అప్పట్లో తమ పొలాల కొలతల్లో తేడా వచ్చాయని అన్నారు. అలాంటి రైతులకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం అన్ని గ్రామాల్లో గ్రామ సభలను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంపాపతిగౌడ్, మండల సర్వేయర్ బసవరాజు స్వామి, వీఆర్వో నాగార్జున, రైతులు ఉన్నారు.

నేటి నుంచి దత్త జయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పాతనగరం లోని దక్షిణ షిరిడీగా వినతికెక్కిన సాయిబాబా దేవస్థానంలో శుక్రవారం, శనివారం దత్త జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం పాలక మండలి కార్యదర్శి ఇ.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి శనివారం ఉదయం 7.30 గంటల వరకు అఖండ సాయినామ భజన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. శనివారం దత్త జయంతి సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు, మహాహారతి కార్యక్రమాలు ఉంటాయని, అనంతరం భక్తులకు అన్నదానం చేస్తారని ఆయన తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఉపాధి కల్పించాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మృతి చెందిన పారిశుధ్య కార్మిక కుటుంబం సభ్యులలో ఒకరికి ఉపాధి కల్పించాలని సీఐటీయూ నాయకులు డిమాండు చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, తాలుకా కార్యదర్శి రాముడు మాట్లాడుతూ ఐదేళ్లలో 12మంది కార్మికులు మృతి చెందారని అన్నారు. జగన్ ప్రభుత్వంలో అప్కాస్ ద్వారా కార్మికులకు ప్రయోజనం కల్పిస్తామని మోసం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా బాధిత కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ గంగిరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాగరాజు, ఇస్మాయిల్, మునీంద్ర, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

మంత్రాలయం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ నాబూల్ మీరా అన్నారు. ఎన్నికల ముందు నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో ఉర్దూ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేసే బాధ్యతను తీసుకుంటామని హామీ ఇచ్చారని, ఆ హామీ మేరకు ఉర్దూ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు.

అనంతపురంలో హెచ్‌ఆర్‌ఎఫ్ 10వ రాష్ట్ర మహాసభలు

ఎమ్మిగనూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మానవహక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల 10వ మహాసభలు జిల్లా కేంద్రమైన అనంతపురంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవేంద్రబాబు గురువారం ప్రకటనలో తెలిపారు. మహాసభలు అనంతపురం పట్టణంలోని సాయినగర్‌లో ఉన్న అంబేడ్కర్ భవన్‌లో ఈనెల 14, 15 తేదీల్లో జరుగుతాయన్నారు. 14న సంఘం సంస్థాగత కార్యక్రమం ఉంటుందని, 15న వివి సామాజిక అంశాలపై వక్తలతో సదస్సు ఉంటుందన్నారు. ప్రజలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు, విద్యావంతులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

అధికారులు హాజరు కావాలి

పెద్దకడబూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సదస్సులకు రిజిస్ట్రార్, ఫారెస్టు అధికారులు హజరు కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతోట మాట్లాడారు. సబ్ కలెక్టర్ దగ్గర పరిష్కారమయ్యే ఆర్‌వోఆర్ కేసులు కలెక్టర్ దగ్గరకు బదిలీ చేశారన్నారు. ఆర్‌వోఆర్ కేసులు త్వరగా పరిష్కారం చేయాలని ఆయన కోరారు.

పింఛన్ ప్రకటించడం అభినందనీయం

మంత్రాలయం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): అనాథ పిల్లలకు పింఛన్లు ఇస్తామని క్యాబినెట్‌లో తీర్మానం చేయడం అభినందనీయమని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు పింఛన్లు ఇవ్వాలని ఎన్నో ఉద్యమాలు చేశామని అన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గర్జి హనుమన్న, యోహాన్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పాటు పడాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో మణిమంజరి

గోనెగండ్ల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని ఎంపీడీవో మణిమంజరి అన్నారు. గురువారం గోనెగండ్లలోని ఎంపీడీవో సమావేశ భవనంలో గ్రామ స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ప్రాంతీయకరణ అనే అంశంపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ అనంతశయన, సతీష్, శివశంకర్, శ్రీనివా సులు, జరినా, సుధాకర్, ఏపీఎం జయన్న తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో భక్తుల సందడి



మంత్రాలయం మఠం ప్రాగంణంలో రద్దీగా ఉన్న భక్తులు

మంత్రాలయం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో సందడిగా మారింది. ద్వాదశి, గురువారం రాఘవేంద్రస్వామి ఇష్టమైన దినం కావటంతో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని నవరత్నాల రథంపై ఊరేగించారు. స్వామి వారికి ఊంజల సేవ నిర్వహించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఇంజనీరింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న వైసీపీ నియోజవర్గ ఇన్‌చార్జి బుట్టా రేణుక

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమస్యలను పరిష్కరించాలని అధ్యక్షుడు నారాయణ, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం సమ్మె కొనసాగిస్తూ ముందుగా స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీగా వెళ్లారు. అనంతరం కార్యాలయం ఎదుట సమ్మెకు కూర్చున్నారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుట్టా రేణుక మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కేశన్న, గడ్డం నారాయణ, నజీర్, రాశేఖర్, నాగేషప్ప నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, బాలాజి, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఆవరణలో పందుల బెడద

రోగాల బారిన విద్యార్థులు

కోసిగి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోసిగి ఇంటిగ్రేటెడ్ హాస్టల్ వద్ద పందుల బెడద మాత్రం తగ్గడం లేదు. పదుల సంఖ్యలో పందులు ఆవరణలో స్వైర విహారం చేస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ హాస్టల్ సమీపంలోనే మూడు అంగన్‌వాడీ సెంటర్లు, కేజీ ప్రాథమిక పాఠశాల, గ్రంథాలయం, ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఉన్నాయి. సుమారు వందల మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. పందుల సంచారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని హాస్టల్ వార్డెన్ అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు వాపో తున్నారు. పంచాయతీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నా రన్న విమర్శలు ఉన్నాయి. ఊరికి దూరంగా తరలించాలని విద్యార్థులు, ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు పందులను దూరంగా తరలించేందుకు కృషి చేయాలని కోరుతున్నారు.



హాస్టల్ సమీపంలో అంగన్‌వాడీ సెంటర్ వద్ద పందుల సమూహం

జర్నలిస్టులకు రక్షణ చట్టాలను అమలు చేయాలి



మంత్రాలయంలో ధర్నా చేస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు, ఎమ్మినూరు, పెద్దకబడూరులో అధికారులకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మంత్రాలయం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల కోసం ప్రత్యేక రక్షణ చట్టాలను తీసుకు రావాలని ఏపీయూడబ్ల్యూజే తాలుకా అధ్యక్షులు వగరూరు జయరాజు, జిల్లా ఉపాధ్యక్షులు చాంద్‌బాషా, ప్రధాన కార్యదర్శి హుశేనీ, సాబువలిలు అన్నారు. విలేకరిపై మోహన్‌బాబు దాడిని ఖండిస్తూ మంత్రాలయంలో రాఘవేంద్ర సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా చేశారు. ర్యాలీగా వచ్చి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు.

విలేకరిపై దాడి హేయం

ఎమ్మిగనూరు రూరల్: సినీ నటుడు మోహన్‌బాబు విలేకరిపై దాడి చేయడం హేయమన్య చర్య అని ఏపీయూడబ్ల్యూజే తాలుకా అధ్యక్షులు శ్రీనివాసుల నాయుడు, పట్టణ అధ్యక్షుడు పరమేశ్వరప్పలు అన్నారు. గురువారం దాడికి నిరసనగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టి డిప్యూటి తహసీల్దార్ వీరేంద్రగౌడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నూర్‌అహ్మద్, రామకృష్ణ, ఈరన్న, రామకృష్ణ సిరాలదొడ్డి రవికుమార్, నాగభూషణం పాల్గొన్నారు.

సినీ నటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి

పెద్దకడబూరు: వీడియో, ఫొటోల కవరేజ్ కోసం వెళ్లిన టీవీ 9 విలేకరిపై దాడి చేసిన సినీ నటుడు మోహన్‌బాబు చర్యలు తీసుకోవాలని ఏపీయూడబ్ల్యూజే నాయకులు పుల్లయ్య, సోమన్న, భీమన్నలు డిమాండ్ చేశారు. గురువారం పెద్దకడబూరులోని ఏపియూడబ్ల్యూజే ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలేఖరులకు రక్షణగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకోరావాలని అన్నారు. కార్యక్రమంలో ఈరన్న, నారాయణ, మల్లికార్జున, రామన్న, లింగమూర్తి, ఏలియాస్, రాజు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ

నందవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన నందవరంలోని ఈశ్వరస్వామి ఆలయం కోసం ఎమ్మెల్యే రూ.50వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు జంబు నాగరాజుగౌడు, ఈసు, ఆలయ నిర్వాహకులు మల్లకల్, ఆదెన్న, జగదీష్, భీమిరెడ్డి పాల్గొన్నారు.

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ పొంది ఉండాలని సీఐ గంగాధర్ అన్నారు. గాజులదిన్నె ప్రాజెక్ట క్రాస్ రోడ్డు దగ్గర వాహన తనిఖీ చేపట్టారు. అలాగే గురువారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. అనంతరం ప్రయాణికులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● పిల్లలకు సెల్‌ఫోన్ పట్ల మక్కువ తగ్గించే విధంగా పిల్లల తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని గోనెగండ్ల సీఐ గంగాధర్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫోన్‌లో కొన్నిరకాల గేమ్స్ వల్ల చెడు వైపు పిల్లలు మళ్లుతున్నారని, ఆ ప్రభావం పిల్లల మెదడుపై పడుతుందని ఆయన అన్నారు. వారి ప్రవర్తనను బట్టి మానసిక వైద్యులకు చూపించి చికిత్స చేయించాలని కోరారు.

గ్రామాభివృద్ధికి సమష్టి కృషి అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీవో పుల్లయ్య

నందవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాలు అభివృద్ధి చెందాలంటే నాయకులు, అధికారుల సమష్టి కృషి అవసరమని ఎంపీడీవో పుల్లయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీ సందీప్ ఆధ్వర్యంలో అధికారులకు పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడు తూ గ్రామ పంచాయతీల వ్యవస్థ బలోపేతానికి గ్రామ స్థాయి అధికారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ఏఈఈ నరసింహాలు, ఏపీఎం రాఘవేంద్ర, కృష్ణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మూర్తి, సచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



క్రీడాకారులకు టీషర్టులు అందజేస్తున్న మంత్రాలయం సీఐ, ఎస్ఐ

మంత్రాలయం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించాలని మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్‌లు అన్నారు. గురువారం రాత్రి మంత్రాలయం సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో మంత్రాలయం ఎస్ఎస్-11 క్రికెట్ జట్టుకు టీషర్టులను సీఐ రామాంజులు సొంత డబ్బులతో అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, పెద్దయ్య, రామకృష్ణ, ఆంజనేయులు, జమీల్, రఘు, వీరేష్ ఉన్నారు.

చిన్నకొత్తిలిలో పశువులకు వైద్యశిబిరం

నందవరం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకొత్తిలి గ్రామంలో గురువారం ఆర్డీటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం చేపట్టారు. పశువైద్యాధికారి నరేంద్రనాథ్‌రెడ్డి చిన్నకొత్తిలి, గంగవరం, జోహరాపురం నుంచి పశవులకు వైద్యం చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1800419880కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కరుణప్ప, నాగరాజు, రుద్ర, రంగప్ప నల్లారెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ కుమారస్వామి

గోనెగండ్ల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. గురువారం గోనెగండ్లలో భూ సర్వే గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో ఈ సభకు రైతులు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. గ్రామ రైతులు తమ భూముల్లో గతంలో సర్వేలు సక్రమంగా నిర్వహించలేదని, హద్దులు సక్రమంగా చూపలేదని ఇలా పలు రకాల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. పరిశీలించి కార్యక్రమంలో రీ సర్వే డీటీ శిరీష, జనార్దన్ రావు, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

నందవరం: రైతులకు రెవెన్యూ గ్రామ సభలు ఎంతో మేలని మాజీ ఎంపీపీ తనయుడు రైస్‌మిల్ నారాయణరెడ్డి, డీటీ మహేష్ అన్నారు. గురువారం మండలంలోని హాలహర్వి గ్రామంలో ఆర్ఐ జర్మీయా ఆధ్వర్యంలో రెవెన్యూ గ్రామ సభలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ చేపట్టిన గ్రామ సభల ద్వారా రైతుల సమస్యలు పరిష్కారమౌతాయన్నారు. కార్యక్రమంలో జగన్నాథరెడ్డి, ఎర్రం నాయుడు, దావీదు, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

మంత్రాలయం: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశామని మంత్రాలయం తహసీల్దార్ ఎస్.రవి అన్నారు. గురువారం మండలంలోని మాధవరం సచివాలయం వద్ద వీఆర్వో నర్సప్ప అధ్యక్షత గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సదస్సులో దరఖాస్తు చేసుకున్న రైతులకు 40 రోజుల్లో పరిష్కారం జరుగుతుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఆర్ఐ ఆదాం, వీఆర్వో ఆనంద్, సర్వేయర్లు ఉరుకుందాచారి, కీర్తి, ఆల్‌ఫ్రెడ్, సువర్ణమ్మ, మధుకర్, పంపాపతి పాల్గొన్నారు.



మాధవరంలో రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ రవి